ఆంధ్రజ్యోతి

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

మంగళవారం 13 మే 2025

మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప వెలుగుల మధ్య తరలివచ్చిన భక్తజనంతో కిక్కిరిసిపోయిన పెంచల లక్ష్మీనృసింహుడి సన్నిధి





పెంచలోరి కల్యాణం..

ముటిసిన భక్తజనం!

- కిక్కిరిసిన పెంచలకోన, వేదగిరి క్షేత్రాలు
- కోనలో రథంపై విహరించిన వధూవరులు
- గజవాహనంపై శ్రీవారి వైభోగం

ఆకాశమే పందిరిగా.. ఓ వైపు వేద పండితుల మంత్రోచ్ఛరణ, మరోవైపు మంగళ వాయిద్యాల నడుమ.. తరలివచ్చిన భక్తులే అతిథులుగా పెంచలకోన, వేదగిరి క్షేత్రాల్లో సోమవారం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనృసింహ స్వామివారి కల్యాణం వేడుకగా జరిగింది. తొలుత ఉదయం కోనలో శ్రీవారి కల్యాణం జరగ్గా, భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం రథోత్సవం, రాత్రి గజవాహనంపై స్వామివారు విహరించారు. ఇక నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి క్షేత్రంలో సాయంత్రం ఉభయదేవేరులతో కలిసి స్వామి వారి కల్యాణం జరిగింది. అనంతరం గజవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

కోనలో గజవాహనంపై లక్ష్మీనృసింహుడు

- వివరాలు 8లో..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నెల్లూరు (విద్య), మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 65 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్నాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరగ్గా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,129 మంది హాజరవగా 278 మంది గైర్హాజరయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో 572 మంది హాజరవగా 43 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐఓ టి.వరప్రసాద్‌రావు 13 సెంటర్లు, డీవీఈఓ 4, డీఈసీ సభ్యులు 8, ఫ్లైయింగ్ స్క్వాడ్ 27 సెంటర్లను పరిశీలించారు.

● 19 నుంచి టెన్త్‌కు..

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి లేదా మనమిత్ర వాట్సప్ నుంచి వివరాలు నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

నెల్లూరు(విద్య) : అర్హత కలిగిన అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృతికాశుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ ఎం.రమణారెడ్డిని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేఏసీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ జయమాలతి జగదీషంను టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ బి.కృష్ణవేణిని రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ జి.కరుణకుమారిని వెంగమాంబాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ పి.సద్గుణరావును కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే పీవీపాళెం కళాశాల హిందీ లెక్చరర్ కె.లక్ష్మీగణేశ్వరిని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, సత్తెనపల్లి కళాశాల సివిక్స్ లెక్చరర్ వి.శ్రీనివాసరావును ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు పదేళ్ల తరువాత పదోన్నతుల ప్రక్రియ జరగడంతో అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

'ట్రేడింగ్' పేరుతో రూ.లక్షలు దోచేశారు

నెల్లూరు (క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి) : ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి వద్ద రూ.21.6 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచేశారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని ఎన్జీవో కాలనీకి చెందిన మురళికి గతేడాది డిసెంబరులో ఫేక్‌బుక్‌లో వచ్చిన ఓ లింక్ ఆధారంగా ఓ ట్రేడింగ్ కంపెనీకి చెందిన యాప్‌లో చేరాడు. ఆ కంపెనీకి చెందిన ప్రతినిధులు ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే నాలుగు నెలల్లో రెట్టింపు లాభాలు పొందుతారని నమ్మించారు. దీంతో మురళి డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు ఆరు విడతల్లో రూ.21.6 లక్షల నగదు డిపాజిట్ చేశారు. అనంతరం ఆయన తన ఖాతాలోని రూ.10 లక్షల నగదును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో కంపెనీ ప్రతినిధులను సంప్రదించారు. బ్రోకరేజ్ ఫీజు రూ.7.99 లక్షలు పంపితే డబ్బు డ్రా చేసుకోవచ్చని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించి బాధితుడు వేదాయపాలెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాపాల్లో పాలుపంచుకున్నాం..

ఇప్పుడు అనుభవిస్తున్నాం!

పైలాన్‌ను ధ్వంసం చేసింది మాజీ ఎమ్మెల్యే ప్రతాపే!

ఆయన ఓ మేకవన్నె పులి!

ఏఎంసీ మాజీ చైర్మన్ సుకుమార్ సంచలన వ్యాఖ్యలు



కావలిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడం వల్ల అన్ని అరాచక కార్యక్రమాల్లో పాలుపంచుకోక తప్పలేదు. అప్పటి పాపాల్లో పాలుపంచుకున్నాం కాబట్టే అనుభవిస్తున్నాం.' అని కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమేల సుకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కావలిలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పైలాన్‌ను ధ్వంసం చేసింది ప్రతాప్‌కుమార్ రెడ్డేనంటూ ఆరోపణలు గుప్పించారు. కావలి వాసుల దాహార్తి తీర్చేందుకు అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఎం. వెంకయ్య నాయుడుతో బీద సోదరులు మాట్లాడి రూ.100 కోట్లతో అమృత్ మంచినీటి పథకాన్ని మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఈ పథకానికి సంబంధించిన పైలాన్‌ను అప్పటి మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారని చెప్పారు. అయితే, పైలాన్‌పై తన పేరు లేదని అక్కసుతో ప్రతాప్‌కుమార్‌రెడ్డి ధ్వంసం చేయించారని ఆరోపించారు. ఆరోజు తాను వ్యతిరేకించానని చెప్పారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో అక్కడికెళ్లానని అప్పటికే పైలాన్ ధ్వంసం జరిగిపోయిందని, ప్రతాప్‌కుమార్ రెడ్డి అక్కడే ఉన్నారని తెలిపారు. ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా బెయిల్ తెచ్చుకొని సంబంధం లేని రిమాండ్‌లో ఉన్న నలుగురు విలేకర్లను గాలికి వదిలేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వాడుకుని వదిలేయడం ఆయన నైజమని, పైకి అమాయకంగా కనిపించే మేకవన్నె పులి ప్రతాప్ అంటూ మాట్లాడారు. తాడేపల్లి, బెంగళూరు ప్యాలెస్‌ల బినామీ ప్రతాప్‌కుమార్ రెడ్డి అని, బెంగళూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో వాకబు చేస్తే ఆయన అవినీతి చిట్టా బయటపడుతుందని దుయ్యబట్టారు. జైలులో ఉన్న విలేకర్లను ప్రతాప్ పట్టించుకోవపోతే బెయిల్ ఇప్పించేందుకు తాను సహకరిస్తానని అన్నారు.



సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్లు

సోమశిల డ్యాం అభివృద్ధికి కార్యాచరణ

రూ.2 కోట్లతో లీకేజీలు, రోప్‌ల పటిష్టత

సీఎం ఆదేశాలతో పనుల్లో కదలిక

అనంతసాగరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయ పరిధిలోని కీలక పనుల్లో కదలిక వచ్చింది. జలవనరుల శాఖ నిపుణుడు, విశ్రాంత ఇంజనీరు కన్నయ్యనాయుడు ఇటీవల సోమశిల డ్యాంను సందర్శించారు. ఇక్కడి లోపాలను నివేదిక రూపంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించడంతో అభివృద్ధి పనులకు ఊతం కలిగింది. దెబ్బతిన్న షెట్టర్లు, రోప్ పనులు చేసేందుకు అండర్‌వాటర్ వర్కర్స్ టీం ఇటీవల డ్యాంకు చేరుకుని కొంతమేర పనులు చేసింది. ఇక లీకేజీలు, రోప్‌లను పటిష్ట పరచడంతోపాటు దెబ్బతిన్న షెట్టర్లను తొలగించి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.2 కోట్లతో టెండర్ల ప్రక్రియ మొదలెట్టగా విశాఖకు చెందిన స్వర్ణ సంస్థ పనులు దక్కించుకుంది. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేబినెట్ సమావేశంలో సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

● వర్షాలకు ముందు పనుల పూర్తి

ఈ నెలాఖరుకు నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆగస్టు మొదటి వారం నుంచి కృష్ణా జలాలు సోమశిలకు చేరే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత తుఫాన్ల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఈలోపు పనులకు ముగింపు పలికితే బాగుంటుందని విశ్రాంత ఇంజనీరింగ్ నిపుణులు సూచిస్తున్నారు. కాగా, డ్యాంలో సోమవారం నాటికి 49.422 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దక్షిణ కాలువకు 50, ఉత్తర కాలువకు 100, పెన్నాడెల్టాకు 5,030 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎస్ఎస్ఏలో పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య) : సమగ్రశిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి పోస్టులకు డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్, ఏఎస్ఓ, ఏఐఈసీఓ, ఉర్దూ ఏఏఎంఓ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో మంగళ, బుధవారాల్లో ఎస్ఎస్ ఏ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చందు, నందు ఇద్దరూ అన్నదమ్ములు. వేసవి సెలవులకు సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మ ఇంటికి వచ్చారు. పెద్దమ్మ కుమారుడితో కలిసి కనిగిరి ప్రధాన కాలువలో ఈతకు వెళ్లారు. నాలుగు రోజులుగా ఇలాగే వెళ్తున్నారు. కాలువలో తక్కువగా నీళ్లు ప్రవహిస్తుండటంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే, సోమవారం కాలువకు సుమారు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇంకేముంది.. ఈ నీటిఉధృతికి ముక్కుపచ్చలారని ఆ ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే..

- కనిగిరి ప్రధాన కాలువలో అన్నదమ్ముల గల్లంతు
- వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చి విషాదం
- ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు
- ఫలించని గజ ఈతగాళ్ల అన్వేషణ





కాలువలో గల్లంతైన చందు, నందు (ఫైల్)

సంగం/కోవూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కోవూరులోని స్టౌబీడి కాలనీకి చెందిన బంధా గోవిందయ్య, శేషమ్మకు చందు (14), నందు (11) కుమారులు. గోవిందయ్య తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో పది రోజుల క్రితం ఇద్దరూ సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మ ఇంటికి వచ్చారు. 4 రోజుల నుంచి వీరిద్దరు పెద్దమ్మ కుమారుడితో కలిసి సరదాగా కనిగిరి ప్రధాన కాలువలో ఈతకు వెళ్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ఈతకు వెళ్లారు. కాలువలో 350 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, సోమవారం నీటి విడుదలను 1500 క్యూసెక్కులకు పెంచడంతో ఉధృతి పెరిగింది. పెద్దమ్మ కుమారుడు మాత్రం గట్టు మీద కూర్చొని మొబైల్ చూసుకుంటున్నాడు. సరిగా ఈతరాని చందు, నందు నీటిలో దిగగానే ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యారు. ఇది గమనించిన పెద్దమ్మ కుమారుడు కేకలు వేశాడు. సమీపంలో ఉన్న పశువుల కాపర్లు అక్కడికి వచ్చి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈతగాళ్లను పిలిపించి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కాలువలకు నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇంతలో చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. సమాచారం అందుకున్న కోవూరులోని తల్లి శేషమ్మ సంగం వచ్చి గుండెలవిసేలా రోదిస్తున్నారు. చందు, నందులు కాలువలు గల్లంతైన విషయం తెలియగానే కోవూరులోని స్టౌబీడీ కాలనీలో విషాద చాయలు అలుముకున్నాయి.

'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల వివరాలు పరిశీలన

కలువాయి, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన లబ్ధిదారుల వివరాల పరిశీలన కార్యక్రమం జరుగుతోందని మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ సోమవారం తెలిపారు. భూమి ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులకు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జెరాక్స్ అందజేయాలని కోరారు. రైతుల ఈకేవైసీ అనంతరం అర్హుల తుది జాబితా ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9025
వెండి కిలో ధర	రూ. 96,900
వెండి ఒక గ్రాము	రూ.99.90

న్యూస్ బాక్స్

ఘనంగా బుద్ధజయంతి



బుద్ధుడికి నివాళులర్పిస్తున్న నేతలు

కలువాయి, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుని జయంతి వేడుకలు సోమవారం స్థానిక ఏడీపీయస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏడీపీయస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్, రేవూరి శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయులు వజ్రాల శ్రీనివాసులు, ఏ మలికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

దుత్తలూరు(ఉదయగిరి), మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుత్తలూరు, సోమలరేగడ, నందిపాడు, బ్రహ్మేశ్వరం, భైరవరం, వెంకటంపేట గ్రామాల్లో సోమవారం వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 26 మందికి టీబీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకారయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ బీబీజాన్, సూపర్‌వైజర్లు ఖాజామొహిద్దీన్, అరుణ కుమారి, హెల్త్ అసిస్టెంట్ అరాఫత్‌అలీ, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పెంచలకోన భక్తులకు అన్నదానం

అనంతసాగరం, మే 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బొమ్మవరం గ్రామానికి చెందిన యూత్ సభ్యులు పెంచలకోనలో జరుగుతున్న ఉత్సవాలకు వచ్చే భక్తులకు సోమవారం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. కూలింగ్ వాటర్, మజ్జిగ, పులిహోర, పెరుగన్నం, అరటిపండ్లు అందచేశారు.

టెన్త్ టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

అనంతసాగరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు, దాత చెన్నూరు శ్రీనివాసులురెడ్డి ఒక్కొక్కరికి రూ 5,116 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభాషిణి, ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో సమాధిని తొలగించాలని వినతి

ఏఎస్ పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య నిర్మించిన సమాధిని తొలగించాలని సోమవారం గ్రామస్థులు వీఆర్‌వో మనోహర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందడంతో ఇళ్ల మధ్య ఖాళీగా ఉన్న పంచాయతీ స్థలంలో ఖననం చేశారు. దీనిపై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ మూడు రోజుల క్రితం ఖననం చేసిన స్థలంలో సిమెంటు ఇటుకలతో సమాధిని నిర్మించారు. దీంతో దానిని తొలగించాలని కోరుతూ వీఆర్‌వోకు గ్రామస్థులు వినతిపత్రం అందచేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఉదయగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్టు అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి వరికుంటపాడు మండలం యర్రం రెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి రూ. 1,10,116 సోమవారం తన ప్రతినిధి ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి బీ వెంకటేశ్వర్లు, స్థానికులు సీహెచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

15న రుణాల దరఖాస్తుల పరిశీలన

ఏఎస్ పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 15వ తేదీన దరఖాస్తులు పరిశీలించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం బ్యాంకు మేనేజర్ల సమక్షంలో దరఖాస్తులను పరిశీలించనున్నట్లు దరఖాస్తుదారులందరూ హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రేపు సంగం మండల సర్వసభ్య సమావేశం

సంగం, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షాలెట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామి పనులు, ఆర్థిక సంఘం నిధులు, జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని ఆమె కోరారు.

అధ్వానంగా బస్ షెల్టర్లు

● నిలువ నీడలేక ప్రయాణికుల అవస్థలు



గుడినరవలో బస్‌షెల్టర్ దుస్థితి



సున్నంవారిచింతల వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

ఉదయగిరి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు వాహనదారులు కాసింత సేద తీరేందుకు నిర్మించిన బస్ షెల్టర్లు నిర్వహణ లోపంతో అధ్వానంగా మారి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. పట్టణాల సంగతి అటుంచితే ప్రధాన గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చిన్నపాటి పనులకు సైతం సమీప పట్టణాలకు పరుగులు తీసే పల్లెప్రజలు గంటల కొద్దీ వాహనాల కోసం రహదారులపై ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు నిర్మించగా మరికొన్ని గ్రామాల్లో దాతలు స్వచ్ఛందంగా నిర్మించారు. ప్రస్తుతం అలాంటి బస్ షెల్టర్లు నిరుపయోగం మారి వెక్కిరిస్తున్నాయి.

మందుబాబులకు అడ్డాగా బస్‌షెల్టర్లు

మండలంలోని వెంగళరావునగర్, గుడినరవ గ్రామాల్లోని బస్టాండ్ సెంటర్లలో నిర్మించిన బస్ షెల్టర్‌లలో నిలబడే అవకాశం లేకుండా పోయింది. ఫ్లోరింగ్ దెబ్బతిన్ని గుంతలమయంగా మారింది. సున్నంవారిచింతల ఎస్సీ కాలనీ సమీపంలోని బస్ షెల్టర్ కంపచెట్ల నడుమ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. మాసాయిపేట, వరికుంటపాడులోని జీ.కొత్తపల్లి, నల్లబోతులవారిపల్లి, కొండ్రాజుపల్లి, మహమ్మదాపురం తదితర గ్రామాలో బస్ షెల్టర్లు మందుబాబులకు అడ్డాగా మారడంతో పాటు అపరిశుభ్రంగా ఉండడంతో అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు వెనకడుగు వేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండలోనే ప్రయాణికుల నిరీక్షణ

మండల కేంద్రమైన దుత్తలూరు, వరికుంటపాడు మండల కేంద్రాలతో సహా తిమ్మారెడ్డిపల్లి, కలిగిరి మండలం అయ్యపరెడ్డిపల్లి, జలదంకి మండలం చినక్రాక, బ్రాహ్మణకాక తదితర ప్రధాన గ్రామాల బస్టాండ్ సెంటర్లలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఆగ్రామాల్లో జాతీయ రహదారి విస్తరించడంతో గంటల తరబడి ఎండలో నిలబడలేక సమీప దుకాణాల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేసవి దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గండిపాళెం పరమేశ్వరుడి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయగిరి పట్టణంలోని శివాలయం, రామాలయం, మండలంలోని గుడినరవ శివాలయం, గండిపాళెం పరమేశ్వర, దత్తాత్రేయ, అభయాంజనేయస్వామి, గంగమ్మతల్లి ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పారువేట ఉత్సవం



రథంపై విహరిస్తున్న పాండురంగ విఠలేశ్వర స్వామి

సీతారామపురం , మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని పండ్రంగి గ్రామం వద్ద ఉన్న పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి, అమ్మవారిని రథంపై ఊరేగించారు. అనంతరం తూర్పు వీధి వారి ఆధ్వర్యంలో పారువేట కార్యక్రమం నిర్వహించారు.

నాగవరపమ్మకు మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరమెర్లలో ఉన్న నాగవరపమ్మ, పోలేరమ్మ ఆలయంలో సోమవారం మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలిశ శిఖరాలను ఆలయం పైకి చేర్చి మహాకుంభాభిషేకం నిర్వహించారు. కుంభాభిషేక జలాల కోసం భక్తులు ఆలయం చుట్టూ బారులు తీరారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనంతసాగరం మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు వద్ద పెన్నానది ఒడ్డున ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్సవాలు ఘనం గా జరుగుతున్నాయి. ఈసందర్భంగా సోమవారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీలోని కృష్ణారెడ్డిపల్లి కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను ముస్తాబు చేసి చలువ పందిరి వద్దకు తీసుకువచ్చి వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులను పారువేటకు తరలించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి : జేవీవీ



గుడ్డ సంచుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు, తదితరులు

ఉదయగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని జేవీవీ నాయకులు దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల వాతావరణం కాలుష్యం, భూగర్భ జలాలు అడుగంటడం, మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను విక్రయించడం మానుకొని గుడ్డ సంచులు, జనపనార బ్యాగుల వాడకాన్ని ప్రజలకు అలవాటు చేయాలన్నారు. కాగా, స్థానిక మేకపాటి వెంకురెడ్డి కళాశాల యాజమాన్యం 500 గుడ్డ సంచులను అందించారన్నారు. ఎస్‌ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ప్రారంభించిన ఇన్‌చార్జ్ ఎంపీడీవో డేవిడ్

ఆత్మకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో మూడుచోట్ల షెడ్యూల్ తెగల వారికి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో యు డేవిడ్ తెలిపారు. సోమవారం మండలంలోని బట్టేపాడులో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురు గిరిజనులకు ఆధార్ కార్డులు లేనందున ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నారని, ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకుని కేవలం ఎస్టీలకు ఆధార్ కార్డులు అందచేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మొదట బట్టేపాడులో ప్రాంభించామని, మంగళవారం మహిమలూరులో, బుధవారం కరటంపాడులో ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్టీలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆధార్ కార్డులు పొందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు వారికి సహకరించాలని కోరారు.

నేటి అలకలతోపు కార్యక్రమానికి ప్రముఖుల హాజరు

వింజమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో వున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13వ తేదీన స్వామివారి కల్యాణం జరుగుతుందని, అనంతరం అలకలతోపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎఫ్‌సీఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అలకల తోపు కార్యక్రమానికి దేవదాయ శాఖ మంది ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఉదయగిరి,కావలి,కనిగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగ్గుమాటి కృష్ణారెడ్డి, ఉగ్రనరసింహారెడ్డిలు హాజరుకానున్నారని, భక్తులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, జూపర్తి రాజారావు, ఆనంగి రమణయ్య, అంకినపల్లి పుల్లారెడ్డి, కొండస్వామి, గంగపట్ల హాజరత్, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరుకు బీజేపీ నేతల సన్మానం



మెట్టుకూరు ధనుంజయరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేత కుడుముల

ఆత్మకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన మెట్టుకూరు ధనుంజయరెడ్డిని సోమవారం ఆత్మకూరు బిజెపి నేతలు నెల్లూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రుణాల మంజూరులో రైతులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు సున్న సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సుభద్ర

ఉదయగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమ వారం జరిగే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సుభద్ర సూచించారు. ఆమె తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను భద్రపరుస్తున్న సీఆర్ఎంటీలు

ఉదయగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి సెమిస్టర్-1 పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సోమవారం తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొదటి విడతగా 14,500 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వాటిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక గదిలో భద్రపరిచామన్నారు. వాటిని తరగతుల వారీగా సరిచూసుకొని పాఠశాలలు తెరిచే నాటికి ఆయా పాఠశాలలకు హెచ్ఎంల ద్వారా చేర్చుతామన్నారు. త్వరలో సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు వస్తాయన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ప్రారంభం

సీతారామపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 19వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నట్లు పరీక్షా కేంద్రం చీఫ్ రహమాన్ తెలిపారు.

అందరి కళ్లు

అక్కడే..!

సెంట్రల్ డివిజన్‌లో నెలాఖరుకు ఈఈ పోస్టు ఖాళీ

- దక్కించుకునేందుకు పలువురి ప్రయత్నాలు
- ఎమ్మెల్యేల చుట్టూ ఆశావాహుల ప్రదక్షిణ
- రేసులో ఎస్ఈ, ఈఈ, డీఈ స్థాయి అధికారులు
- రాష్ట్రంలో అతిపెద్ద ఇరిగేషన్ డివిజన్..
- ఏటా రూ.వందల కోట్ల బిల్లులపై సంతకాలు

నెల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టు... ఈ పదం ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. కిందిస్థాయి ఉద్యోగుల దగ్గర నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకూ ఈ పోస్టు గురించే చర్చించుకుంటున్నారు. ఎందుకంటే నెల్లూరు సెంట్రల్ డివిజన్ రాష్ట్రంలోనే అతిపెద్ద ఇరిగేషన్ డివిజన్. ఇక్కడ ఏటా ఈఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో రూ.వందల కోట్ల పనులు జరుగుతుండడమే పైచర్చకు కారణం. ఈ నెలాఖరుతో ప్రస్తుతమున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఈ సీట్లో కూర్చునేందుకు పలువురు ఇంజనీర్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికివారు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్నారు. 'మేము మీకు అనుకూలంగా ఉంటాం.. మీరు చెప్పినట్లు వింటాం.. మాకు లెటర్ ఇవ్వండి' అంటూ మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోటీలో ఎస్ఈ స్థాయి నుంచి డీఈఈ స్థాయి అధికారుల వరకూ ఉన్నట్లు శాఖలో ప్రచారం జరుగుతోంది.



● **రూ.వందల కోట్ల పనులే కారణం.**

సెంట్రల్ డివిజన్ పరిధిలోకి ఆరు నియోజకవర్గాలు వస్తాయి. కోవూరు, నెల్లూరు రూరల్, సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాలు పూర్తిగా ఈ డివిజన్ పరిధిలోనే ఉండగా, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లోని కొంతభాగం సెంట్రల్ డివిజన్ కిందకు వస్తుంది. డెల్టాలోని 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు దీనిలోనే ఉంది. ఒక్క ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) కిందనే ఏటా రూ.30 -40 కోట్ల వరకూ ఈ డివిజన్ పరిధిలో పనులు జరుగుతుంటాయి. ఇక ప్రస్తుతం ఇక్కడ రూ.100 కోట్లతో పెన్నా రక్షణ గోడల నిర్మాణం, మరో రూ.100 కోట్లతో సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ, ఇంకో రూ.100 కోట్లతో జాఫర్‌సాహెబ్ కాలువ ఆధునికీకరణ, మరో రూ.100 కోట్లతో ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవిగాక సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు, జైకా వర్కులు వంటి రూ.వందల కోట్ల విలువైన పనులు సెంట్రల్ డివిజన్ పరిధిలో జరుగుతున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో మరెక్కడా పనులు జరగడంలేదు. ఇంజనీర్లు ఈ డివిజన్‌కు వచ్చేందుకు పోటీ పడడానికి ఇదే ప్రధాన కారణంగా చెప్పుకుంటున్నారు. అదేవిధంగా లేఅవుట్లు, ఇళ్ల, కాలువల నిర్మాణాల వంటి పనుల కోసం ప్రజలు, వ్యాపారులు ఎన్‌వోసీల కోసం ఈ డివిజన్‌కు పెద్ద సంఖ్యలో వస్తారని అంటున్నారు.

● **పలువురి ప్రయత్నాలు**

సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టుకు ఎప్పుడూ పోటీ ఉంటుంది. గతేడాది బదిలీల సమయంలో కూడా ఇక్కడకు వచ్చేందుకు అనేక మంది ఇంజనీర్లు ప్రయత్నాలు చేశారు. కొందరు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను సంపాదించి రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించారు. అయితే ఏడాదిలోపు సర్వీసు ఉన్న అధికారులను బదిలీ చేయవద్దని ప్రభుత్వం సూచించడంతో ప్రస్తుత ఈఈ నాగరాజు బదిలీ జరగలేదు. ఆయన ఈ నెలాఖరుతో రిటైర్ అవుతున్నారు. దీంతో అప్పట్లో ప్రయత్నాలు చేసిన ఇంజనీర్లకు నిరాశే ఎదురైంది. ఇప్పుడు మరోసారి వీరంతా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఈఈగా ఉన్న అధికారి సెంట్రల్ డివిజన్‌కు ప్రయత్నించారు. ఈయనకు చాలామంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారని సమాచారం. అయితే ప్రభుత్వ నిర్ణయంతో ఈ అధికారికి జిల్లాలో మరో డివిజన్ పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఎస్ఈగా ఉద్యోగోన్నతి పొందారు. ఇప్పుడు కూడా ఈ అధికారి సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. ఇక మరో డీఈఈ స్థాయి అధికారి కూడా తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశం నిర్వహణ బాధ్యతలను కూడా ఈ డీఈఈ స్థాయి అధికారి చూసుకున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇక మరో డీఈఈ స్థాయి అధికారి ప్రస్తుతం ఈఈగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఆ అధికారి కూడా సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలానే ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన ఓ ఇద్దరు ఈఈ స్థాయి అధికారులు కూడా ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతుండడం గమనార్హం. అయితే చివరకు ఈ పోస్టులో ఎవరు కూర్చుంటారన్నది నెలాఖరులోపు తెలిసిపోనుంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కనియంపాడు గ్రామానికి చెందిన దొడ్ల మాధవ (38) వరికుంటపాడు నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు మోటారుబైకుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఒకరికి గాయాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రెండు కార్లు ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన సోమవారం విరువూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం మండలం దేవిశెట్టిపల్లి గ్రామం నుంచి హైదరాబాదు వెళ్తున్న కారు, విరువూరు నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తున్న మరో కారు వేగంగా వెళ్తూ ఢీకొన్నాయి. దీంతో ఓ కారు రహదారి సమీపంలోని గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 500



గురుకులంలో చెదలు నివారణకు చర్యలు

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆదేశాల మేరకు సోమవారం మలాథియాన్ స్ప్రే చేశారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనరసయ్య మాట్లాడుతు తరగతి గదులు, గోడలకు ఫంగస్, బ్యాక్టీరియా (చెదలు) చేరకుండా ఉండేందుకు స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పనులా..

- అభివృద్ధి పనుల బిల్లులకు బ్రేక్!
- వడ్డీలు కట్టలేకున్నామని నేతల ఆవేదన
- చెల్లించే వరకు ప్రారంభానికి ససేమిరా..

మాకొద్దు బాబోయ్..!

వలేటివారిపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పూర్తి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అవస్థపడుతుంటే మళ్లీ కొత్త పనులా.. మాకొద్దు బాబోయ్ అంటూ నేతలు ఆందోళన చెందుతున్నారు. వివరాల మేరకు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి విడతలో ఉపాధి హామీ పథకం కింద వలేటివారిపాలెం మండలానికి 25 పనులకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మొదట్లో పనులు చేసిన అయ్యవారిపల్లె, నలదలపూరు, కళవళ్ల గ్రామాల్లో పనులు చేసిన వెంటే బిల్లులు చెల్లించారు. దీంతో ఏ పని చేసినా తక్షణం బిల్లులు వస్తాయని భావించిన కొందరు నేతలు ప్రజాప్రతినిధులతో గొడవలు పడి పనులు దక్కించుకొని ఆగమేఘాలపై అప్పులు చేసి అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు పూర్తి చేశారు. అన్ని నామినేటెడ్ పనులు కావడంతో పోటీపడి చేశారు. అయితే పనులు చేసి ఏడెనిమిది నెలలు అవుతున్నా బిల్లులకు అతీగతి లేదు. అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేసిన వాళ్లు బిల్లులు అందక దిక్కులు చూస్తున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని ద్వితీయశ్రేణి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మరికొన్ని పనులు చేసేందుకు నేతల ఎవరూ ముందుకు రావడంలేదు. బిల్లులు చెల్లించకుండా పూర్తయిన పనులు ప్రారంభించేందుకు ఆ నేతలు ససేమిరా అంటున్నారు.



బడేవారిపాలెంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

అప్పుడూ ఇప్పుడూ అలాగే ...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున పనులు చేశారు. ఆ తరువాత అధికారం కోల్పోవడంతో వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులను నిలిపివేసింది. దీంతో చాలా మంది అప్పులపాలై కొంతమంది ఆత్మహత్యల వరకు వెళ్లారు. మరికొంత మంది కోర్టును ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత బిల్లులు చెల్లిస్తారని నాయకులు ఆశించారు. అయితే ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. ఈసారైనా పోయిన సొమ్ము సంపాదించుకుందామని పనులు చేపడితే చేసిన పనులకు బిల్లులు రాకపోవంతో అధికార పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోని పరిస్థితి ఇప్పుడు కూడా ఎదురుకావడంతో కొంతమంది పని చేసిన నాయకులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. పనులు చేసి అప్పుల పాలై వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడూ ఇప్పుడూ ఇలాగే అయితే తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరయ్యేలా చూడాలని టీడీపీ నేతలు కోరుతున్నారు.

అదిగో.. ఇదిగో అంటున్నారు

సిమెంటు రోడ్ల పనులు చేసిన నేతలు బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంది వాస్తవమే. ప్రతి రోజూ బిల్లులు అడుగుతున్నారు. బిల్లులు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు కూడా అదిగో ఇదిగో అంటున్నారు.

\- శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ, వలేటివారిపాలెం

సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు

- త్రివిక్రమ్‌రావు, ఏఈఈ, మైనర్ ఇరిగేషన్, లింగసముద్రం



లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి చెరువుల అభివృదిలో భాగంగా 7 చిన్నతరహా, 8 పంచాయతీరాజ్ చెరువుల పనులకు ప్రతిపాదనలు పంపగా 5 చిన్నతరహా, 1 పంచాయతీరాజ్ చెరువుకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని మైనర్ ఇరిగేషన్ ఏఈఈ టీ.త్రివిక్రమ్‌రావు తెలిపారు.

? చిన్నతరహా సాగునీటి చెరువుల అభివృద్ధి పనులు ఎప్పుడు చేపడుతారు.

! మండలంలో 15 చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపగా ఆరు చెరువులకు నిధులు మంజూరయ్యాయి. పరిపాలన అనుమతులు రాగానే పనులు మొదలు పెడుతాం.

? ఏఏ చెరువులకు నిధులు మంజూరయ్యాయి. ఏఏ పనులు చేపడుతారు.

! పెదపవని, చినపవని, వీఆర్ కోట, లింగసముద్రం కొత్త, పాత చిన్నతరహా చెరువులకు, ఎర్రారెడ్డి పాలెం పంచాయతీరాజ్ చెరువుకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువుల కట్టలు, చెరువులకు నీరొచ్చే వాగులు, ఒరవలు, తూములు, కాలువల మరమ్మతు పనులు చేపడుతాం.

? మండలంలోని చెరువుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! చెరువుల ఆక్రమణలను గుర్తించేందుకు రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చాం. వారు సర్వే చేసి ఆక్రమణలను గుర్తించిన అనంతరం ఆక్రమణలను తొలగించి ట్రెంచ్ ఏర్పాటు చేస్తాం.

? చెరువుల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలపై తమకు ఫిర్యాదులు వస్తే పరిశీలించి వాహనాలను సీజ్ చేసి పోలీసు కేసులు నమోదు చేయిస్తాం. గ్రావెల్ అక్రమంగా తరలించే సమాచారం తనకు ఫోన్ ద్వారా తెలపాలి.

న్యూస్ బాక్స్

ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు



గాలికి పడిపోయిన విద్యుత్ స్తంభం

కొండాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు బలమైన ఈదురుగాలులతో చిరుజల్లులు కురిశాయి. ఈదురుగాలుల ధాటికి కొమ్మి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గానుగపెంట, పెరికపాలెం గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడంతోపాటు దాదాపు ఐదు స్తంభాలు కూలిపోయాయి. స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈదురుగాలులకు గతంలోనూ విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌కి సన్మానం

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో బంధువుల ఇంటికి విచ్చేసిన ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును ఆదివారం రాత్రి దళిత నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గుడ్లూరులో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అక్కడి నుంచి తన బంధువైన టీడీపీ నేత పఠ్రి గోపీకృష్ణ, కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న దళిత నేతలు జైభీం రవిచంద్ర, జ్యోతి నాగరాజు, గాలి రమేష్‌లు ఆయను మర్యాదపూర్వకంగా కలిసి కేక్‌కట్ చేసి సన్మానించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు : ఎంవీఐ

కందుకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మైనర్లతో ఇసుక, మట్టి ట్రాక్టర్లు, ఆటోలు నడిపిస్తున్నారని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలకు కేసులు నమోదు చేస్తామని కందుకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు హెచ్చరించారు. సోమవారం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో, కారు డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల సనరిష్కార వేదిక కార్యక్రమంలో భూ సమస్యలపై రెండు అర్జీలు అందినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు లబ్ధిదారుల నుంచిదరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏళ్ల వయస్సు గల వారు రాయితీ రుణాల కోసం మీసేవ, గ్రామ సచివాలయాలలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హతలతో కూడిన దరఖాస్తును ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

హరిప్రసాద్‌కు జనసేన నేత అభినందన

లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన నాయకుడు పసుపులేటి హరిప్రసాద్‌కు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తిరుపతిలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా శ్రీనివాసులు

లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి తహసీల్దారుగా (ఎఫ్ఏసీ) డీటీ కె శ్రీనివాసులును కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ నియమించారు. ఈ మేరకు సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ తహసీల్దారుగా పని చేస్తున్న ఎస్ సీతామహాలక్ష్మి అనారోగ్య కారణాలతో ఈనెల 7 నుంచి 23వ తేదీ వరకు సెలవు పెట్టడంతో శ్రీనివాసులును ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

కళ్లను కాటికి పంపొద్దు!

- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవదానంపై అవగాహన

కావలి, మే 12(ఆంధ్రజ్యోతి): మనిషి మృతి చెందాక కళ్లను కాటికి పంపకుండా దానం చేస్తే ఎంతో మంది అంధులకు చూపు ఇచ్చిన వారవుతారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. మనదేశంలోని అంధులలో 20 శాతం మంది కార్నియా లోపం కలిగిన వారే ఉన్నారని, వారికి చనిపోయిన వ్యక్తుల కార్నియా సేకరించి చూపు కల్పించవచ్చని పేర్కొన్నారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యురాలు, అభయం సేవా సంస్థ నిర్వహకురాలు ఇలింద్ర శ్రీవాణి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి భజన మందిరంలో సోమవారం నేత్ర, అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 70 మంది కార్నియా అంధులకు ఒక్కరు మాత్రమే నేత్రదానం చేస్తున్నారని, 140 కోట్ల మందిలో ఒక శాతం నేత్రదానం చేసినా కార్నియా అంధులు ఉండరని తెలిపారు. బ్రెయిన్‌డెడ్ అయినపుడు అవయవ దానం చేయవచ్చన్నారు. అనంతరం చనిపోయిన తర్వాత నేత్రదానం చేసిన 15 మంది కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కొత్తూరు సత్యం, అభయం సేవాసంస్థ నిర్వాహకులు ఇలింద్ర వెంకటేశ్వర్లు(ఈవీఎస్), నూనె రామమోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, అరికట్ల మధుసూదనరావు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రోటరీక్లబ్ అధ్యక్షురాలు ఎస్.స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రావుస్వామిపాలెంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం ప్రహరీ నిర్మాణం, మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య తెలిపారు. సోమవారం ఆయన ఆ హాస్టల్‌ను సందర్శించారు. స్థానిక సమస్యలను వార్డన్ ఎం.అనిత ఆయనకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం, గదులు, మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.14 లక్షల మంజూరైనట్లు తెలిపారు. హాస్టల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర ఆయనను కోరారు.



ప్రహరీ నిర్మించాల్సిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య

ప్రమాదాలకు నిలయంగా క్రాస్ రోడ్డు!

- చౌదరిపాలెం, బుడంగుంట గ్రామాలకు రాంగ్ రూట్‌లో వెళ్లాల్సిందే

కావలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి కావలి మండలం చౌదరిపాలెం గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి నుంచి చౌదరిపాలెం, బుడంగుంట తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముసునూరులోని మాగుంట పార్వతమ్మ ట్రంక్‌రోడ్డు నుంచి చౌదరిపాలెం క్రాస్ రోడ్డుకు వాహనాలు వెళ్లాలంటే జాతీయ రహదారిపై 500 అడుగుల మేరకు రాంగ్ రూట్‌లో వెళ్లక తప్పడం లేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు సంబంధం లేకుండా దానికి ఆనుకుని జాతీయ రహదారి పక్కన ఉన్న రోడ్డును చౌదరిపాలెం క్రాస్ రోడ్డు వరకు పొడగించాలని వాహనదారులతోపాటు చౌదరిపాలెం, బుడంగుంట వాసులు కోరుతున్నారు.



జాతీయ రహదారికి ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న చౌదరిపాలెం క్రాస్‌రోడ్డు

రోగులకు పండ్లు పంపిణీ

కావలిటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి) : నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సోమవారం బాలింతలు, గర్భిణులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి పాల్గొని నర్సులచే రోగులకు పండ్లు పంపిణీ చేయించారు. ఆమె మాట్లాడుతూ నర్సింగ్ డేని పురస్కరించుకుని వారి సేవలను గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రియాంక, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, తదితరులు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 12(ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సమీక్ష సమావేశం ఒంగోలులోని ప్రకాశం భవన్ పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, సహచర శాసన సభ్యులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా జరిగిన సమీక్షలో కందుకూరు నియోజకవర్గంలోని మండలాల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

తహసీల్దారు కార్యాలయంలో పని చేయని ఇంటర్నెట్

లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం తహసీల్దారు కార్యాలయంలో గత 10 రోజుల నుంచి ఇంటర్నెట్ పనిచేయక పోవడం లేదు. దీంతో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు హాజరు కాలేకున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీనివాసులును వివరణ కోరగా తమకు ఏపీ ఫైబర్‌నెట్ కనెక్షన్ ఉందని, అది 10 రోజులుగా కనెక్ట్ కావడం లేదని చెప్పారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

వలేటివారిపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి అడవుల్లో సాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. 'స్థావరాలు మారుస్తూ జోరుగా పేకాట' అని ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక పోలీసులు స్పందించారు. చుండిలో పేకాట శిబిరంపై ఎస్‌హెచ్‌వో బ్రహ్మయ్య తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుమంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5400, మూడు మోటారుబైకులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న పేకాటరాయుళ్లను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన ఎస్‌హెచ్‌వో తెలిపారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో అగ్నిప్రమాదం

కందుకూరు, మే 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. కార్యాలయం ముందు తాటాకుల పందిరి వేసి ఉంది. అకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో కార్యాలయంలో పనిచేసే వ్యక్తులు చూసి పందిర కింద పార్క్ చేసిన కార్లు, విలువైన వస్తువులు బయటకు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలు అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నట్లు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పంట కాలువ నిర్మాణ పనులు చేపట్టండి : సీపీఎం

కావలిటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని పంట కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని సీపీఎం నేతలు కోరారు. సోమవారం సీపీఎం నేతలు పంట కాలువను సందర్శించి కాలువ దుస్థితిపై మున్సిపల్ ఆర్‌వో ఫణికుమార్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య మాట్లాడుతూ కావలి చెరువు నుంచి పాతూరు మీదుగా వెళ్లే పంట కాలువ పూడికతో నిండిపోయి నీరు ముందుకు ప్రవహించక దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిందని, పందులు సైరవిహారం చేస్తున్నాయన్నారు. దీంతో కాలువకు ఇరువైపులా నివాసం ఉండే ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. కాలువకు రక్షణ గోడలు లేవని, కాలువ పక్కన రోడ్లు ధ్వంసం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పంట కాలువ పూడిక తీసి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, మధు, కమలాకర్ పాల్గొన్నారు.



మున్సిపల్ ఆర్‌వో ఫణికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

భూములు పరిశీలించిన ఆర్డీవో

అల్లూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తు మోపూరు, గ్రద్దగుంట గ్రామాల్లో చేపట్టిన రీసర్వేలో చెరువులుగా నమోదైన భూములను కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ సోమవారం సాయంత్రం పరిశీలించారు. నార్తుమోపూరులో 174 ఎకరాల భూమిలో కేవలం 4 ఎకరాలు మాత్రమే చెరువు కింద నమోదై ఉండగా రీసర్వే చేపట్టిన సమయంలో 174 ఎకరాల భూమిని చెరువు కింద నమోదు చేశారు. దీంతో గత శుక్రవారం అల్లూరులో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో రైతులు ఇచ్చిన అర్జీలపై ఆయన స్పందించి పరిశీలించారు. అదేవిధంగా గ్రద్దగుంటలో ఇటువంటి సమస్య ఉండడంతో సదరు భూములను కూడా ఆయన పరిశీలించారు. ఈ భూముల వివరాలను ప్రత్యేక నివేదికలను తయారుచేసి ఇవ్వాలని తహసీల్దారు లక్ష్మీనారాయణను ఆదేశించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



భూముల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

తాబేళ్ల రక్షణకు ప్రత్యేక హేచరీలు

● జిల్లావ్యాప్తంగా 10 ఏర్పాటు : డీఎఫ్‌వో



ఓలీవ్‌రెడ్లీ తాబేళ్లను సముద్రంలో వదులుతున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

నెల్లూరు(వెంకటేశ్వరపురం) మే 12 (ఆంధ్రజ్యోతి): అరుదైన ఓలీవ్‌రెడ్లీ తాబేళ్ల సంరక్షణ కోసం జిల్లావ్యాప్తంగా 10 ప్రత్యేక హేచరీలను ఏర్పాటు చేసినట్లు డీఎఫ్‌వో మహబూబ్‌బాషా పేర్కొన్నారు. కావలి రేంజ్ పరిధిలోని సముద్రతీర ప్రాంతంలో సోమవారం ఆయన కుటుంబసభ్యులతో కలసి తాబేళ్లను సముద్రంలో వదిలారు. అనంతరం మాట్లాడుతూ పది హేచరీల్లో 30వేల తాబేళ్ల గుడ్లను సంరక్షించామన్నారు. ఇప్పటి వరకు హేచరీల్లోని గుడ్లను కృత్రిమంగా పొదిగించి, 24,481 తాబేళ్లుగా మార్చి సముద్రంలో వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి రేంజర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

మండే ఎండల్లోనూ వందల అర్జీలు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 387 వినతులు
● పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు
● అర్జీదారులకు మధ్యాహ్న భోజనం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) మే 12 (ఆంధ్రజ్యోతి) : మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. జిల్లాలో సోమవారం 41 డిగ్రీల సెల్సియస్ ఎండ కాచింది. అయినా కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి 387 మంది వచ్చి అర్జీలు సమర్పించారు. ఇక్కడి తిక్కన ప్రాంగణం అర్జీదారులతో నిండిపోయింది. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయడంతో అర్జీదారులకు కొంతమేర ఉపశమనం లభించింది. కలెక్టర్ ఆనంద్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన వారు చెప్పినది ఓపిగ్గా విన్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు అర్జీలను పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. కాగా, సోమవారం వచ్చిన అర్జీల్లో ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 131, మున్సిపల్ శాఖవి 42, సర్వే శాఖవి 35, పంచాయతీరాజ్ శాఖకు చెందినవి 29, పోలీసుశాఖకు సంబంధించిన 62 ఉన్నాయి. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : జనసేన

నెల్లూరు నగరంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకుడు గునుకుల కిషోర్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నగరానికి ఏడు బాక్స్ టైప్ బ్రిడ్జిలు మంజూరై ఎనిమిదేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు నివారించేందు కు ఆ వంతెనలను వెంటనే నిర్మించాలని కోరారు.

దారి మూసేశారు

తన మామిడి తోటకు దారి ఇవ్వకుండా మూసేశారని బోగోలు మండలం ఎస్‌వీ పాలెం గ్రామస్తుడు ద్వారం వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తనకు సర్వే నెంబరు 88ల్లో 62 సెంట్ల భూమి ఇచ్చిందన్నారు. అందులో మామిడి చెట్లు సాగు చేశానన్నారు. ఇప్పుడు గ్రామానికి చెందిన ద్వారం శ్రీనివాసులు, నాగరాజమ్మ తోటకు వెళ్లడానికి దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. న్యాయం చేయాలని అభ్యర్థించారు.

పెన్షన్ ఇప్పించండి

వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీవాసి చెముడుగుంట వెంకట సుబ్బయ్య వినతిపత్రం ఇచ్చారు. 70 శాతం వైకల్యం ఉన్న తనకు దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని కోరారు.

ఉపాధి పథకంలో అక్రమాలు

ఉపాధి హామీ పథకం (నరేగా) పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరం సోషల్ ఆడిట్‌లో దాదాపు రూ.5కోట్లకుపైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ఉపాధి హామీ పనుల అవినీతి అక్రమాల నివేదిక వెల్లడించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ గడువు పొడిగించండి

నెల్లూరు (వైద్యం) మే 12 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి అవసరమైన గడువు పెంచాలని కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్ సోమవారం కలెక్టరేట్ గీవెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అల్లావుద్దీన్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రెహమాన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(విద్య), మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గుర్తింపు లేకుండా, భవన నిర్మాణాలు పూర్తికాకుండా అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షారూక్ కోరారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో డీఆర్‌వోకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నేతలు మస్తాన్, నవీన్, హర్ష తదితరులు పాల్గొన్నారు.



కలుగోళ్ల శాంభవికి లక్ష మల్లెల పూజ

కావలి, మే 12(ఆంధ్రజ్యోతి): కావలి కలుగోళ్ల శాంభవి ఆలయంలో బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 108 మంది ముత్తైదువులచే లక్ష మల్లెల పూజా జరిగింది. ఈ ఆలయాన్ని ఇటీవల దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లిన తర్వాత ఆలయ ఈవో ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలతో లక్ష మల్లెలపూజ తొలి కార్యక్రమంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ముత్తైదువులచే లక్షమల్లెల పూజా కార్యక్రమం చేట్టినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై

నేడు ధర్నా : ఎన్‌ఎంయూఏ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగు ల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం (నేడు) చేపడుతున్న చలో డీపీటీవో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి టీ. మురళీమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు ప్రాంగణంలో ఉన్న ఎన్‌ఎంయూఏ కార్యాల యంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమయ్యాక వారిని అనేక సమస్యలు వెంటాడుతున్నాయని, సమస్యల పరిష్కారం కోసం పలు దఫా లుగా పోరాటాలు చేసినా, ప్రభుత్వం స్పందించడం లేదన్నా రు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మంగళవారం డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాల యం(డీపీటీవో) వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీని వాసరావు, రాష్ట్ర కార్యదర్శి అనీల్‌కుమార్ పాల్గొంటున్నా రని తెలిపారు. జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఉన్న ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీహెచ్ చెంచురెడ్డి, పీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

శాక్సాఫోనే శ్వాస!

శాక్సాఫోనే శ్వాసగా ముందుకు సాగుతూ పలువురి ప్రశంశలందుకుంటున్నారు కావలికి చెందిన తాళ్లపాలెం సత్యనారాయణ(సత్యం). జిల్లాకు మొదటగా శాక్సాఫోన్ పరిచయం చేసిన ప్రముఖ విద్వాంసుడు తాళ్లపాలెం వెంకట సుబ్బయ్య, యానాదమ్మ దంపతుల కుమారుడు ఆయన. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఆలయాల్లో కచేరీలు చేసి ప్రజాప్రతినిధులు, అధికారుల మన్నన పొందారు

● వాద్యంలో సత్యనారాయణ దిట్ట
● ఎన్నో ఆలయాల్లో కచేరీలు
● ప్రముఖుల ప్రశంసలు, పురస్కారాలు



కచేరీ చేస్తున్న సత్యనారాయణ

సత్యనారాయణకు చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో క్షౌర వృత్తి చేసుకుంటూ తండ్రి స్ఫూర్తితో శాక్సాఫోన్ వాద్యంలో నైపుణ్యం సాధించారు. సత్యాన్ని అతని చిన్నాన్న తాళ్లపాలెం మాల్యాద్రి చేరదీసి శాక్సాఫోన్ వాయించడంలో మెలకువలు నేర్పి ప్రోత్సహించారు. అనంతరం ప్రముఖ విద్వాంసుడు నడమనూరు నటరాజ వద్ద శిక్షణ పొంది విద్వాంసుడిగా ఎదిగారు. శిష్య బృందాన్ని ఏర్పరచుకుని వారితో కలిసి అనేక దేవాలయాల్లో కచేరీలు చేస్తున్నారు. కావలిలోని ప్రముఖ ఆలయాలైన కలుగోళ శాంభవి అమ్మవారి ఆలయం, శివాలయం, విష్ణాలయం, హనుమత్ క్షేత్రం, బృందా వనం కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కొండబిట్ర గుంట బిలకూట క్షేత్రం, నెల్లూరులోని పలు ఆలయాలు, శ్రీశైలం పుణ్యక్షేత్రంలో సత్యం కచేరీలతో ప్రతిభను చాటారు.

● ప్రశంసలు... పురస్కారాలు

కావలిలో సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన శ్రీధర్, ఆర్డీవో శీనానాయక్ నుంచి ఉత్తమ కళాకారుడి పురస్కారం అందుకున్నారు. నెల్లూరు టౌన్‌హాల్‌లో సింహపురి సంస్కృతి సమాఖ్య వారు అందించిన ఉత్తమ కళాకారుడి పురస్కారాన్ని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి నుంచి అందుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి, మాజీ మంత్రి కాకాణి, ఎంపీలు బీ ఎమ్మార్, వేమిరెడ్డి, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ తదితరులతో శభాష్ అనిపించుకుని పురస్కారాలు, సత్కారాలు పొందారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

తగినంత ప్రోత్సాహం లేక యువత కళారంగం వైపు ఆసక్తి కనబరచడంలేదు. కళాకారులకు ప్రభుత్వాలు రాయితీలు, సంక్షేమ ఫలాలందించి ప్రోత్సహించాలి. తద్వారా కళను, కళాకారులను బతికించాలి.

- తాళ్ళపాలెం సత్యనారాయణ



మాజీ ఎమ్మెల్యే వంటేరు నుంచి పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

కేంద్ర కారాగారంలో

రిమాండ్ ఖైదీ మృతి

వెంకటాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడు గుంట సమీపంలో ఉన్న జిల్లా కారాగారంలో సోమవారం రిమాండ్ ఖైదీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నా యి. ఎన్‌టీఆర్ జిల్లా మాచవరం ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్లా (41) సూర్యాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో గత ఏడాది ఏప్రిల్ 28 తేదీ నుంచి రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కాగా, సోమవారం ఉదయం 5.55 గంటల సమయంలో స్పృహ కో ల్పోయి పడిపోయాడు. దీంతో వెంటనే జైలు సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. జైలు సూపరిండెంట్ వెంకటేశ్వ రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్..

నెల్లూరు(క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆత్మకూరు బస్టాండు ఫ్లైవోవర్‌బ్రిడ్జిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందాడు. నార్త్‌ట్రాఫిక్ పోలీసుల సమా చారం మేరకు, కోవూరు మండలం చుండుగుంట గ్రామానికి చెంది న ఎన్ సాయి వెంకట ప్రతాప్(26) నగరంలోని పొగతోటలోగల విజయ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం స్కూటీపై ఇంటి నుంచి ల్యాబ్‌కు బయలుదేరాడు. ఆత్మకూ రు బస్టాండు ఫ్లైవోవర్ బ్రిడ్జిపై వస్తుండగా స్కూటీని ట్రాక్టర్ ఢీకొ నడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్‌ఐ జే. బలరామిరెడ్డి సంఘటనా స్థలా నికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షయ నివారణ చర్యలు తీసుకోండి

● రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ తహసినా

నెల్లూరు (వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ తహసినా ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని డామియెన్ ఫౌండేషన్ ఆసుపత్రిలో క్షయ నివారణపై సమీక్ష జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. క్షయ కేసులు ఎక్కడెక్కడ ఎక్కువగా ఉన్నాయి?, వారికి అందుతున్న వైద్య చికిత్సలు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు చికిత్సలతోపాటు మంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్ వలి, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ భవాని పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కు 79 ఫిర్యాదులు



పీజీఆర్‌ఎస్ బయట నడవలేని మహిళ నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు(క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ ఎస్‌కు జిల్లావ్యాప్తంగా 79 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య వినతులు స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

● నెల్లూరుకి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో లలిత అనే మహిళ పరిచయమై ఫోరెక్స్ ట్రేడింగ్ కంపెనీలో డబ్బులు పెడితే అధిక ఆదాయం వస్తుందని నమ్మించింది. దీంతో అతను రూ.10.30 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయాడు. విచారించి న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదు చేశారు.

● సంగం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి, బుచ్చి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రఫీ, అతడి కుటుంబస భ్యులు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి పలుదఫాలుగా రూ.6 లక్షల వరకు నగదు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించలేదని, నగదు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

● తన భర్త మరణించాడని, భర్త అన్న కుమారుడు రఫీ తాను నివాసం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని ఆత్మకూరుకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఖాళీ చేయకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని ఆమె కోరింది.

పెంచలోరి కల్యాణం..

మురిసిన భక్తజనం!

● కోనలో కనుల పండుగగా నృసింహుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

రాపూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో నృసింహ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో కొలువు దీర్చి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. ఈ సమయంలో ఒక్కసారిగా ప్రాంగణమంతా 'శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి, గోవిందో... గోవిందా' అంటూ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం విశ్వక్సేన పూజ, కన్యాదానం నిర్వహించారు. శుభ ముహూర్తాన స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచి శా స్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ము క్కోటి దేవతలు వీక్షించే ఈ వేడుక ను సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే ముం దుండి జరిపిస్తున్నాడని అర్చకులు, భక్తులు తన్మయం చెందారు. ఈ శుభసమయాన కొత్త జంటలు కూ డా మూడు ముళ్ల బంధంతో ఒకటయ్యాయి. కాగా, ఉత్సవర్లకు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

● రథంపై నూతన దంపతులు

రాత్రి ఏడు గంటలకు రథంపై స్వామి వారు ఉభయనాంచారులతో కలిసి కోన తిరువీధుల్లో విహరించారు. పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై కొత్త దంపతులు కొలువుదీరి కోన వీధుల్లో విహరించడం క్షేత్ర సంప్రదాయం. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు రథాన్ని లాగి తన్మయత్వం చెందారు. భక్తులు రథాన్ని లాగుతూ దివ్యనామస్మరణ చేశారు. అనంతరం గజ వాహన సేవ జరి గింది. ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసు లు రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు, ఆల య ప్రధానార్చకులు పెంచలయ్యస్వా మి, సీతారామయ్య స్వామి, టీడీడీ పాం చరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు. కాగా, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందించారు.





కోనలో శ్రీవారి కల్యాణం తిలకిస్తున్న భక్తజనులు, (ఇన్‌సెట్) ఎంపీ వేమిరెడ్డితో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

● నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, స్నపన తిరుమంజనం జరగనుంది. రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వవాహనసేవ, 11 గంటలకు ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.




కల్యాణోత్సవానికి తరలివస్తున్న శ్రీవారు, భక్తజనం

భక్తులతో కిక్కిరిసిన వేదగిరి

● వేడుకగా శ్రీవారి కళ్యాణం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంసంధ్యవేళ వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహుడి కల్యాణం వేడుకగా జరిగింది. తొలుత వేకువజామున బంగారు గరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన స్వామివారు పల్లకీ పై దేవరపాళెంలో విహరించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన స్వామి వారిని అలంకరణ మండపంలో పెళ్లికుమారిడిగానూ, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను పెళ్లికుమార్తెలగానూ అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు ఉత్సవర్లను తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు నేతృత్వంలోని అర్చక బృందం శాస్త్రోక్తంగా వివా హ తంతు నిర్వహించారు. ముందుగా బ్రహ్మోతవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈవో గోపి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, వాహనాలతో వేదగిరి క్షేత్రం సందడిగా మారింది. రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

● వేదగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దేరవపాళెంలో రథోత్సవం జరగనుంది.



గరుడ వాహనంపై నరసింహ స్వామి

ఓటర్ల చేర్పులు నిరంతర ప్రక్రియ : తహసీల్దారు బాబా

కోవూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ఓటర్ల చేర్పు నిరంతరం సాగే ప్రక్రియని తహసీల్దారు నిర్మలారంద బాబా అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్వోలు నిరంతరం 18 ఏళ్ల నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో బుచ్చి తహసీల్దారు ఏ వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ రవి, నాయకులు గండవరపు శేషయ్య, పీ సుబ్బారావు, నాటకరాని వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9025
వెండి కిలో ధర	రూ. 96,900
వెండి ఒక గ్రాము	రూ. 99.90

న్యూస్‌ బాక్స్‌

'అన్నదాత సుఖీభవ' మార్గదర్శకాలు విడుదల

తోటపల్లిగూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైనట్లు మండల వ్యవసాయ అధికారి శిరీష రాణి తెలిపారు. సంవత్సరానికి ఒక రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.6వేలు చొప్పున మొత్తం రూ.20వేలు సాగు ఖర్చుల కోసం రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్‌లో సాగు భూమి ఉన్న రైతులు పథకానికి అర్హులవుతారన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో దీనికి సంబంధించిన డేటా వెరిఫికేషన్‌ ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుందని, రైతులు తమ ఆధార్‌, భూమి వివరాలతో మండల పరిధిలోని రైతు సేవా కేంద్ర సహాయకులను కలిసి తమ వివరాలను పరిశీలించుకోవాలని తెలిపారు.

నేడు కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

సైదాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు పాత ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనంలో ఎమ్మెల్యే రామకృష్ణ బహిరంగ సమావేశం ఏర్పాటుచేసి, అనంతరం దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మురళీకృష్ణకు జ్ఞానీ జైల్‌సింగ్‌ అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళీకృష్ణ

ముత్తుకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జ్యోతిష పండితుడు డాక్టర్‌ జీవీబీ మురళీకృష్ణ జ్ఞానీ జైల్‌సింగ్‌ మెమోరియల్‌ జాతీయ అవార్డును అందుకున్నారు. దీంతో మురళీకృష్ణను సోమవారం పలువురు నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌ జర్నలిస్టు యూనియన్‌ ఐదో వార్షికోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌, ఏపీ సంపాదకుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌, ఏపీజేయూ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు నుంచి మురళీకృష్ణ అవార్డును అందుకున్నారు.

మనుబోలులో అకాలవర్షం

మనుబోలు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఫ్లెక్సీలు, బ్యానర్లు నేలకూలాయి. అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగింది. రహదారులు జలమయమయ్యాయి.

15న రామతీర్థంలో వేలం పాట

విడవలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసివున్న కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 16న జరగనున్న నేపథ్యంలో దేవాలయానికి రంగులు, విద్యుద్దీపాలంకరణ, వాల్‌ పోస్టర్లు, బ్రహ్మోత్సవాలు జరిగే కాలంలో అన్నదానం నిర్వహణకు ఈనెల 15న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తు ధరావత్తు చెల్లించాలని, పూర్తి వివరాలకు నెంబరు 9666619331ను సంప్రదించాలని కోరారు.

జైలుకు వెళ్లేంత వరకూ కాకాణికి బెయిల్‌ రాదు

● జనసేన నేత బొబ్బేపల్లి

వెంకటాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నమోదైన కేసులలో ఆయన జైలుకు వెళ్లేంత వరకు బెయిల్‌ రాదని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. పొదలకూరు మండలం వరదాపురంలో అక్రమ మైనింగ్‌ చేసి రూ.255 కోట్ల రుపాయల అవినీతి చేశాడని, ఆ కేసులో నాలుగవ ముద్దాయిగా ఉన్న కాకాణి గత రెండు నెలలుగా పరారీలో ఉన్నాడని విమర్శించారు. కాకాణిని జైలుకు పంపించే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు.

సమస్యలు పరిష్కరించండి



జెన్కో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ముత్తుకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెన్కో కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. నేలటూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం ఎదుట కార్మికులు అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. గత 30 రోజులుగా తాము నిరసన చేస్తున్నా జెన్కో యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. రోజువారీ కార్మికులుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్‌ కార్మికులుగా గుర్తించాలన్నారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రామలింగేశ్వరుడి సేవలో న్యాయాధికారి దంపతులు

విడవలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసివున్న రామలింగేశ్వర స్వామిని జిల్లా న్యాయాధికారి గీత, చంద్రకుమార్‌ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకి ప్రత్యేక పూజలు చేసి తీర ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ గుమస్తా వెంకటేశ్వర్లు ఉన్నారు.



స్వామి వారి సన్నిధిలో న్యాయాధికారి దంపతులు

సమష్టిగా పనిచేసి మంచిపేరు తేవాలి

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విడవలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, పాత టీడీపీ నాయకులతో విభేదాలు లేకుండా సమష్టిగా పనిచేసి పార్టీకి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మంచిపేరు తీసుకురావాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, సర్పంచులు సురేంద్రరెడ్డి, అరగల వినోద్‌, బెల్లంకొండ సుప్రజ, మాజీ ఎంపీటీసీ కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, వారితో పాటు సుమారు 300 మంది నాయకులు, కార్యకర్తలు పాత టీడీపీ నాయకులతో కలసి నెల్లూరులోని వీపీఆర్‌ నివాసంలో సోమవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పార్టీలో పాత, కొత్తవారని తేడాలేకుండా ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోనికి తీసుకుపోవాలన్నారు. గ్రామీణాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములై పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరికి సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్‌ చానల్‌ డీసీ చైర్మన్‌ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, ఆవుల వాసు, ఆవుల రవిచంద్ర, ఓగు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వేమిరెడ్డి దంపతులతో నాయకులు

ఐకమత్యంతో గ్రామాభివృద్ధికి తోడ్పడండి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, మే 12(ఆంధ్రజ్యోతి) : ఐకమత్యంతో గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని పున్నూరులో సోమవారం నెల్లూరు పార్లమెంటు ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పొన్నేబోయిన చెంచుకిషోర్‌యాదవ్‌ ఆధ్వర్యంలో వీపీఆర్‌ ఫౌండేషన్‌ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పున్నూరు, లేబూరు గ్రామస్థుల అభ్యర్థన మేరకు అధ్వానంగా ఉన్న లింకురోడ్డును దాదాపు రూ.5 లక్షలు వెచ్చించి తాత్కాలికంగా నిర్మించామన్నారు. త్వరలోనే ఈ రోడ్డును పూర్తిస్థాయిలో వేయడమే కాకుండా కల్వర్టు నిర్మాణం కూడా చేపట్టి వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా చేస్తానన్నారు. పున్నూరు మూలపాడు వాసుల శ్మశానం కోసం వీపీఆర్‌ ఫౌండేషన్‌ ద్వారా కొన్న భూమిని అభివృద్ధి చేసేందుకు నిధు లు మంజూరు చేయిస్తానన్నారు. గ్రామ నాయకులు విభేదాలను పక్కన పెట్టి స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని గ్రామాభివృద్ధికి పాటు పడాలని హితవు పలికారు. అనుమతి లేకుండా గ్రావెల్‌ తవ్వకాలు చేస్తే సహించేదిలే దన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేదిలేదన్నారు. తన ఎన్నికల నినాదమైన అవినీతి రహిత కోవూరుకు తూట్లు పొడిచి తనకు చెడ్డపేరు తేవద్దని నాయకులను కోరారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద కొబ్బరి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడురెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, పీఎల్‌.రావు, అవ్వారు ఏడుకొండలు, బొద్దుకూరు సుధాకర్‌, చిట్టిబోయిన వేణు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

● పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రెడ్డిపాళెంలో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు వెంకురెడ్డి, సుబ్బారెడ్డి, ప్రజలు, పలు సమస్యలు ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో మూలమూర్తులు, పరివార దేవతల ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ఎమ్మెల్యే గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు రమణారెడ్డి, నాయకులు హరికృష్ణ, బీజేపీ. జనసేన నాయకులు బాలిరెడ్డి, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

● రైతులకు రాయితీపై యాంత్రీకరణ పరికరాలు

మండలంలోని మునులపూడిలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రూ.4,55,175 రాయితీతో 21 ట్రాక్టర్‌ పనిముట్లు, 14 పవర్‌ స్ప్రేయర్లను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కోవూరు ఏడీఏ సుజాత, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

కోవూరు, మే 12(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో షేక్‌ ఖాదర్‌వలీ ఫ్లోరెన్స్‌ నైటింగేల్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొవిడ్‌ సమయంలో నర్సులు ప్రాణాలకు తెగించి సేవ చేశారని చెప్పారు. నర్సుల చేస్తున్న సేవ అద్వితీయమైందని పేర్కొన్నారు. అనంతరం పెద్ది ప్రభావతి చారిటబుల్‌ ట్రస్టు నిర్వాహకులు 18 మంది నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు లీలావతి, వెంకటచలపతి, ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్‌, పూర్వ ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, పెద్ది ప్రభావతి చారిటబుల్‌ ట్రస్టు ప్రతినిధులు వేముల నిఖిల్‌, పెద్ది హితేష్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.



నైటింగేల్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సులు

ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం

వెంకటాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్‌ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో సోమవారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. శిక్షణలో భాగంగా ఫైరింగ్‌, డ్రిల్‌, వ్యాయామం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్‌ కల్నల్‌ డీ కరంచంద్‌ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవర్చు కుంటారన్నారు. పదిరోజుల పాటు జరిగే శిక్షణ శిబిరాన్ని ఎన్‌సీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో మేజర్‌ రాజేష్‌కుమార్‌, హేమంత్‌, ఆర్మీ, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫైరింగ్‌ శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

ఘనంగా వాడె పూడెమ్మ జాతర

వెంకటాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుంటపాళెంలో సోమవారం సాగునీటి సంఘం అధ్యక్షుడు, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్‌ ఆధ్వర్యంలో వాడె పూడెమ్మ (గ్రామదేవత) జాతర ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బోణాలు, వీరతాళ్లు, తప్పెట్లు, మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. చివరిరోజైన మంగళవారం జాతరకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరు కానున్నారు.



బోనాలతో మహిళలు

ఆర్మీ జవాన్‌ మురళీ నాయక్‌కు నివాళి

రాపూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్‌ సిందూరలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్‌ మురళీ నాయక్‌ చిత్రాన్ని మండలంలోని సిద్దవరం గ్రామానికి చెందిన సూక్ష్మ చిత్ర కళాకారుడు పల్లి చిరంజీవి అమ్మవారి కుంకుమతో రూపొందించి నివాళి అర్పించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మనుబోలు, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై మనుబోలు క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం జరిగింది. తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన మునికృష్ణ ఉద్యోగరీత్యా మనుబోలుకు మోటార్‌సైకిల్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మోటార్‌సైకిల్‌పై ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డు పక్కన టైర్‌పంక్చర్‌ కావడంతో నిలిపిఉన్న మినీవ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో మోటార్‌సైకిల్‌ బోల్తాపడి మునికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురందరపురంలో నూతనంగా నిర్మించిన సీతా లక్ష్మణ సేమత కోందడరామస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారు, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ పూజలు, హోమాలు సోమవారం వైభవంగా జరిగాయి. మంగళవారం అభిషేకాలు, జలాధివాసం, క్షీరాధివాసం, శయ్యాది వాసం పూజలు, హోమం కార్యక్రమాలు జరగనున్నట్లు పండితులు తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న రిత్వికులు



నేత్రపర్వం నృసింహ గ్రామోత్సవం

మనుబోలు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. నరసింహస్వామి జయంతి సందర్భంగా దేవస్థానంలో మూలవర్లకు ఆలయ అర్చకులు క్షీర, పంచామృతాభిషేకాలు, పూలంగిసేవ చేశారు. రాత్రికి స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

ఈశ్వరమ్మ ఆలయానికి రూ.1.5 లక్షల వితరణ

విడవలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రామతీర్థం గ్రామం పాతూరులో వెలసివున్న ఈశ్వరమ్మఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ చిమటా రమాదేవి, రామతీర్థం గ్రామ మాజీ సర్పంచు చిమటా వెంటేశ్వర్లు దంపతులు సోమవారం రూ.1.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన కుమారుడు చిమటా అభిలాష్‌ జ్ఞాపకార్థంగా ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నాటారు వెంకటేశ్వర్లు, తంబి శ్రీనివాసులు, రామలింగయ్య, పురిణి పోలయ్య, చెంచు రత్నం గోవిందయ్య, నాగేంద్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచు చిమటా వెంకటేశ్వర్లు

అందరి కళ్లు

అక్కడే..!

సెంట్రల్‌ డివిజన్‌లో నెలాఖరుకు ఈఈ పోస్టు ఖాళీ

- దక్కించుకునేందుకు పలువురి ప్రయత్నాలు
- ఎమ్మెల్యేల చుట్టూ ఆశావాహుల ప్రదక్షిణ
- రేసులో ఎస్‌ఈ, ఈఈ, డీఈ స్థాయి అధికారులు
- రాష్ట్రంలో అతిపెద్ద ఇరిగేషన్‌ డివిజన్‌..
- ఏటా రూ.వందల కోట్ల బిల్లులపై సంతకాలు

నెల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్‌ డివిజన్‌ ఈఈ పోస్టు... ఈ పదం ఇప్పుడు ఇరిగేషన్‌ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. కిందిస్థాయి ఉద్యోగుల దగ్గర నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకూ ఈ పోస్టు గురించే చర్చించుకుంటున్నారు. ఎందుకంటే నెల్లూరు సెంట్రల్‌ డివిజన్‌ రాష్ట్రంలోనే అతిపెద్ద ఇరిగేషన్‌ డివిజన్‌. ఇక్కడ ఏటా ఈఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో రూ.వందల కోట్ల పనులు జరుగుతుండడమే పైచర్చకు కారణం. ఈ నెలాఖరుతో ప్రస్తుతమున్న ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌(ఈఈ) పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఈ సీట్లో కూర్చునేందుకు పలువురు ఇంజనీర్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికివారు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్నారు. 'మేము మీకు అనుకూలంగా ఉంటాం.. మీరు చెప్పినట్లు వింటాం.. మాకు లెటర్‌ ఇవ్వండి' అంటూ మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోటీలో ఎస్‌ఈ స్థాయి నుంచి డీఈఈ స్థాయి అధికారుల వరకూ ఉన్నట్లు శాఖలో ప్రచారం జరుగుతోంది.



● రూ.వందల కోట్ల పనులే కారణం.

సెంట్రల్‌ డివిజన్‌ పరిధిలోకి ఆరు నియోజకవర్గాలు వస్తాయి. కోవూరు, నెల్లూరు రూరల్‌, సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాలు పూర్తిగా ఈ డివిజన్‌ పరిధిలోనే ఉండగా, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లోని కొంతభాగం సెంట్రల్‌ డివిజన్‌ కిందకు వస్తుంది. డెల్టాలోని 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు దీనిలోనే ఉంది. ఒక్క ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌(ఓఅండ్‌ఎం) కిందనే ఏటా రూ.30 -40 కోట్ల వరకూ ఈ డివిజన్‌ పరిధిలో పనులు జరుగుతుంటాయి. ఇక ప్రస్తుతం ఇక్కడ రూ.100 కోట్లతో పెన్నా రక్షణ గోడల నిర్మాణం, మరో రూ.100 కోట్లతో సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ, ఇంకో రూ.100 కోట్లతో జాఫర్‌సాహెబ్‌ కాలువ ఆధునికీకరణ, మరో రూ.100 కోట్లతో ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవిగాక సర్వేపల్లి రిజర్వాయర్‌ ఆధునికీకరణ పనులు, జైకా వర్కులు వంటి రూ.వందల కోట్ల విలువైన పనులు సెంట్రల్‌ డివిజన్‌ పరిధిలో జరుగుతున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో మరెక్కడా పనులు జరగడంలేదు. ఇంజనీర్లు ఈ డివిజన్‌కు వచ్చేందుకు పోటీ పడడానికి ఇదే ప్రధాన కారణంగా చెప్పుకుంటున్నారు. అదేవిధంగా లేఅవుట్లు, ఇళ్లు, కాలువల నిర్మాణాల వంటి పనుల కోసం ప్రజలు, వ్యాపారులు ఎన్‌వోసీల కోసం ఈ డివిజన్‌కు పెద్ద సంఖ్యలో వస్తారని అంటున్నారు.

● పలువురి ప్రయత్నాలు

సెంట్రల్‌ డివిజన్‌ ఈఈ పోస్టుకు ఎప్పుడూ పోటీ ఉంటుంది. గతేడాది బదిలీల సమయంలో కూడా ఇక్కడకు వచ్చేందుకు అనేక మంది ఇంజనీర్లు ప్రయత్నాలు చేశారు. కొందరు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను సంపాదించి రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించారు. అయితే ఏడాదిలోపు సర్వీసు ఉన్న అధికారులను బదిలీ చేయవద్దని ప్రభుత్వం సూచించడంతో ప్రస్తుత ఈఈ నాగరాజు బదిలీ జరగలేదు. ఆయన ఈ నెలాఖరుతో రిటైర్‌ అవుతున్నారు. దీంతో అప్పట్లో ప్రయత్నాలు చేసిన ఇంజనీర్లకు నిరాశే ఎదురైంది. ఇప్పుడు మరోసారి వీరంతా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఈఈగా ఉన్న అధికారి సెంట్రల్‌ డివిజన్‌కు ప్రయత్నించారు. ఈయనకు చాలామంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారని సమాచారం. అయితే ప్రభుత్వ నిర్ణయంతో ఈ అధికారికి జిల్లాలో మరో డివిజన్‌ పోస్టింగ్‌ ఇచ్చారు. ఆ తర్వాత ఎస్‌ఈగా ఉద్యోగోన్నతి పొందారు. ఇప్పుడు కూడా ఈ అధికారి సెంట్రల్‌ డివిజన్‌ ఈఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. ఇక మరో డీఈఈ స్థాయి అధికారి కూడా తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశం నిర్వహణ బాధ్యతలను కూడా ఈ డీఈఈ స్థాయి అధికారి చూసుకున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇక మరో డీఈఈ స్థాయి అధికారి ప్రస్తుతం ఈఈగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఆ అధికారి కూడా సెంట్రల్‌ డివిజన్‌ ఈఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలానే ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన ఓ ఇద్దరు ఈఈ స్థాయి అధికారులు కూడా ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతుండడం గమనార్హం. అయితే చివరకు ఈ పోస్టులో ఎవరు కూర్చుంటారన్నది నెలాఖరులోపు తెలిసిపోనుంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్‌), మే 12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కనియంపాడు గ్రామానికి చెందిన దొడ్ల మాధవ (38) వరికుంటపాడు నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు మోటారుబైకుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రఘునాథ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అయ్యప్పగుడి సెంటర్‌లో చోరీ

నెల్లూరు(క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని అయ్యప్పగుడి సెంటర్‌లో గోవిందమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఇంట్లోనే ఆమె చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె. గోవిందమ్మ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంటికి తాళాలు వేసి ఆమె తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం సింగనాలత్తూరులోని కుమార్తె ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం గుర్తుతెలియని దుండగులు గోవిందమ్మ ఇంటి తలుపు గొళ్లెం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.78 వేలు నగదు, మూడు సవర్ల బంగారు గొలుసును దోచుకెళ్లారు. తలుపులు తెరిచి ఉండటాన్ని పక్కంటివారు గమనించి బాధితురాలికి ఫోన్‌ చేసి సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన ఇంటికి చేరుకుని చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని నగదు, నగలు కనిపించక పోవడంతో వేదాయపాలెం పోలీసుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270
కోడిగుడ్ల ధర (100):	500

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నెల్లూరురూరల్, మే 12,(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్‌చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నియోజకవర్గంలోని క్లస్టర్ ఇన్‌చార్జిలతో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు ఆహ్వానపత్రిక అందచేశారు.


కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

న్యూస్ బాక్స్

ఘనంగా సత్యనారాయణ వ్రతం


సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మహిళలు

నెల్లూరు (సాంస్కృతికం) మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేక అలంకారం, విశేష పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బీ.శ్రీనివాసాచార్యులు, శాశ్వత ఉభయ దాతలు బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

కమనీయం కాశీనాథుడి కల్యాణం


కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

నెల్లూరు (సాంస్కృతికం) మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథుడి ఆలయంలో సోమవారం రాత్రి వైభవంగా కల్యాణం జరిగింది. అర్చకస్వాములు ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక పాలాభి షేకాలు, అమ్మవార్లకు నవావరణ, ఖడ్గమాల పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా ఆడిటర్ ఎస్‌వీఎస్ రాఘవేంద్రరావు, గిరిజ, దంపతులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో జీ.దర్గయ్య, పత్తి జయరామయ్యనాయుడు, కొలపర్తి రమేష్, కామేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

● నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8.30గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులంతా తరలిరావాలని కోరారు.

బీదను కలిసిన జడ్‌ఎస్ దంపతులు


డాక్టర్ జడ్‌ఎస్ దంపతులకు పూలకుండీ అందచేస్తున్న బీద దంపతులు

నెల్లూరు (వైద్యం) మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్‌గా నియమితులయిన టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జడ్ శివప్రసాద్ దంపతులు సోమవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర దంపతులను ఆయన నివాసంతో కలిసారు. ఈ సందర్భంగా బీదరవిచంద్ర జడ్‌ఎస్‌ఆర్‌కు శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన్ను సన్మానించి పూలకుండీ అందచేశారు.

● బీదను కలిసిన మెట్టుకూరు

ఎమ్మెల్సీ బీద రవిచంద్రను నగరంలోని ఆయన నివాసంలో ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. బీదను శాలువాతో సన్మానించారు.

నియామక పత్రాల అందజేత

నెల్లూరు (సాంస్కృతికం) మే 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ రైట్ టూ ఇన్‌ఫర్‌మేషన్ యాక్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కమిషనర్‌లకు కొత్తగా ఎన్నికైన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీలకు ఆ సంస్థల జాతీయ అధ్యక్షుడు షేక్.జిలానీబాషా మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన కమిటీలు వేశామని, వారిని విలేకర్లకు పరిచయం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మురారి మధు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో బదిలీలు

నెల్లూరు(సిటి), మే 12 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ లోని రెవెన్యూ విభాగంలో బదిలీలు జరిగాయి. మేనేజర్, ఆర్వోగా పనిచేస్తున్న ఇనయ్ తుల్లాను ఇంజనీరింగ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావు, సమ్మద్‌లను రెవెన్యూ అధికారులుగా నియమించారు. ఇదే విభాగంలో పనిచేస్తున్న రాజేశ్వరిని మేనేజర్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీహెచ్‌వోల నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) మే 12 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌సీలు) చేస్తున్న సమ్మె సోమవారానికి 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం నేత భానుమహేష్ మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వ సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. నర్సింగ్‌కు ఎంతో ఆదర్శంగా ఉన్న ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆశయాలకు అనుగుణంగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీ, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, ఉపాధ్యక్షురాలు రెబెనా తదితరులు పాల్గొన్నారు.


గాంధీబొమ్మ వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 12 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల మార్పును నిరసిస్తూ ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని "సీఐటీయూ రూరల్ కార్యదర్శి కే. పెంచలనరసయ్య కోరారు. రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రధాన బస్టాండు ప్రాంగణంలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో సోమవారం సమ్మె బుక్‌లెట్స్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంచల నరసయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేసి, నాలుగు చట్టాలుగా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. దీంతో కార్మికులకు పని గంటలు పెరిగి, వేతనాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఈనెల 20న ఉద యం 10 గంటలకు ఏబీఎం కాంపౌండ్ నుంచి జరిగే ర్యాలీలో కార్మికులు, స్కీమ్ వర్కర్స్, మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనా లని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండా ప్రసాద్, ఎండీ అబ్దుల్ అజీజ్, ఎం సుధాకర్, సంపత్‌కుమార్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నేత కట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


సమ్మె బుక్‌లెట్స్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

నెల్లూరు(సిటీ), మే 12,(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు వస్తాయని, ఇందుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎన్‌ఎంసీ కమిషనర్ వైవో నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించగా, నగర వాసులు వినతులు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై 40 మంది నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. వీటికి ఆయా విభాగాల ద్వారా పరిష్కారం చూపుతామన్నారు. 17వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కాగా ఎంహెచ్‌వో చైతన్య కూడా 28వ డివిజన్‌లో తనిఖీలు నిర్వహించారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

కళాజాతాల ద్వారా హెచ్‌ఐవీ నివారణ

నెల్లూరు (వైద్యం) మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవీ వ్యాధి నివారణకు, కళాజాతాలు ఎంతో ఉపయోగపడతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో జాతాలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ హెచ్‌ఐవీ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. జిల్లాలోని ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కళాజాతాను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

పదిలో 450కి పైగా మార్కులు వచ్చిన

గౌడ విద్యార్థులకు పురస్కారాలు అందిస్తాం!

నెల్లూరు (హరనాధపురం) మే 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పదో తరగతిలో 450పైబడి మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ చెప్పారు. నగరంలోని సుజాతమ్మకాలనీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరు గోవిందయ్యగౌడ్ ఆశయ సాధనలో భాగంగా వీటిని అందచేస్తున్నామన్నారు. జూన్ 15వతేదీ లోగా విద్యార్థులు తమ దరఖాస్తును కోసూరు రాజశేఖర్‌గౌడ్, డోర్ నెంబరు 24-3-390, సుజాతమ్మకాలనీ, 3వ వీధి, దర్గామిట్ట, నెల్లూరు అనే చిరునామాకు పంపాలని కోరారు. పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, టీసీ లేదా క్యాస్ట్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు కాపీ, ఫోన్ నెంబరుతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99850 6959, 81424 42333, 91777 56265 నెంబర్లను సంప్రదించాలని కోరారు. జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తన తండ్రి కోసూరు గోవిందయ్య గౌడ్ విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని 10 సంవత్సరాల నాడు చేపట్టారని తెలిపారు. ఆయన మన మధ్య లేకపోయినా, గౌడ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నానని చెప్పారు. ఈ సమావేశంలో ముత్యంగౌడ్, ఉప్పాల రామకృష్ణగౌడ్, తాతా రమణయ్యగౌడ్, ఆలపాక శ్రీనివాసులు గౌడ్, మోర్ల వెంకటేశ్వర్లు,ఆలపాక రవిగౌడ్, తాతా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న తోట ప్రభాకర్‌గౌడ్

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సాహెబ్‌పీర్ సహకారంతో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడాకారులకు పౌష్టికాహారం అందచేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ వాకర్స్‌కు ఆరోగ్య సమస్యలు, పరిష్కారాలు తెలియచేయడంతో పాటు క్రీడాకారులకు పౌష్టికాహారం అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సైకాలజిస్ట్ డాక్టర్ సింగంశెట్టి అభిషేక్ బాల, బాలికలకు స్ఫూర్తిని నింపే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పోటోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్, మాజీ అధ్యక్షులు వేలూరు రంగారావు, సభ్యులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి

నెల్లూరు (సాంస్కృతికం) మే 12 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి, తనకు రక్షణ కల్పించాలని కలెక్టర్, సీఎంలకు జలదంకి మండలం చోడవరం గ్రామానికి చెందిన నన్నారి కోటయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నెంబరు 166/4లో తన తండ్రికి ప్రభుత్వం అసైన్‌మెంట్ భూమి0.96 సెంట్లు ఇచ్చిందని, దాన్ని ఇప్పటి వరకు సాగు చేసుకుంటున్నానని తెలిపారు. గ్రామానికి చెందిన ఎల్లవల నాగేశ్వరరావు దౌర్జన్యంగా వచ్చి రెండేళ్లుగా పంట దిగుబడిని తీసుకెళ్లి భయపెడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆర్డీవో, తహసీల్దారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. తన భూమికి, తనకు రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు బస్సుల దందా

● ఆర్టీసీ బస్టాండ్ల బయటే ఆపి ప్రయాణికులకు ఆహ్వానం
● కిక్కిరిసేలా ఎక్కిస్తున్న వైనం
● కన్నెత్తి చూడని అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ల బయటే ప్రైవేటు వాహనాల దందా రోజురోజుకు పెరిగిపోతుంది. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయ్యాక సంస్థకు వస్తున్న నష్టాలపై పెద్దగా దృష్టి సారించడం లేదు.దీంతో బస్టాండ్ల బయట ప్రైవేటు వాహనాలు దందా చేస్తున్నా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు వాహనాల యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటూ అధికారులు మౌనం వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరు రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్టాండ్లు ఉన్నాయి. అన్నీ బస్టాండ్ల బయట ప్రైవేటు వాహనాల దోపిడీ సాగుతోంది. బస్టాండ్ల బయటే ప్రైవేటు బస్సులు, ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకు వెళ్లకూడదన్న నిబంధనలు ఉన్నాయి. అయితే ప్రతి బస్టాండు బయటా వందల సంఖ్యలో ఆటోలు నిలిపి పెద్దగా అరుస్తూ పల్లెప్రాంతాలకు ప్రయాణికులను ఎక్కించుకు వెళుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉండే నెల్లూరు ప్రధాన బస్టాండు బయట చెన్నై, తిరుపతి, బెంగళూరు వైపు వెళ్లే ప్రైవేటు బస్సులను నిలిపి ప్రయాణికులకు పిలిచి మరీ ఎక్కించుకుంటున్నారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండు చుట్టుపక్కల ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసుకొని అల్లూరు, బుచ్చి, కోవూరు, కొత్తకోడూరు.. ఇలా పల్లె ప్రాంతాలకు ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయణికులను ఎక్కించుకుంటున్నారు. జిల్లా అధికారులు ఉండే నెల్లూరులోనే ఈ పరిస్థితులు ఉన్నాయంటే ఇతర డిపోల్లోని ఆర్టీసీ బస్టాండ్లు బయట ప్రైవేటు దందా ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

● కన్నెతి చూడని అధికారులు

ప్రైవేటు వాహనాల ఆగడాలను అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. బస్టాండు బయట ప్రైవేటు వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయడం, పలు రూట్లలో రవాణాశాఖ అధికారులను కలుపుకొని అధికంగా ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేటు వాహనాలపై తనిఖీలు చేయాల్సిన అధికారులు మనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు వాహనాల యజమానులు ప్రతి నెలా మామూళ్లు ముట్టుతుండటంతోనే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.



ఆర్టీసీ ప్రధాన బస్టాండు బయట నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేటు బస్సు

'రాజుభవన్‌లో భాగం ఇవ్వండి'

నెల్లూరు (సాంస్కృతికం) మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డ్రైవర్ల కోసం కలెక్టర్ రాజు సహకారంతో అసోసియేషన్ భవనం నిర్మించామని, అందులో తమకు భాగం ఇవ్వాలని కలెక్టర్‌కు జిల్లా ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎస్‌కె.కాలేషా, సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆనాడు చందాలు, విరాళాలు పోగుచేసి నిర్మించిన రాజుభవన్‌కు నెలకి రూ1.50లక్షల ఆదాయం అద్దెల రూపంలో వస్తున్నదని తెలిపారు. రాజుభవన్‌లో ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్లకు సమాన భాగం కల్పించాలని వారు కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినవారిలో బ్రహ్మయ్య, వెంకటరమణ, సందానీ, తదతరులు ఉన్నారు.

నేడు విద్యుత్ కోత

నెల్లూరు (జడ్పీ), మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్డు వెడల్పు పనుల కారణంగా విద్యుత్ స్తంభాలు మార్చుతున్నందున పొదలకూరు రోడ్డు, పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ ఎం శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ ఆసుపత్రి, జడ్పీ కాలనీ, సారా అంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమి నగర్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన తెలిపారు.

వీపీఆర్ దంపతులను కలిసిన మెట్టుకూరు

నెల్లూరు (హరనాథపురం) మే 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోమవారం నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాతో సత్కరించారు. డీసీసీబీ పదవి రావడంపై కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో అన్నదానం


అన్నదానం చేస్తున్న మల్లికార్జున యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పే), మే 12 (ఆంధ్రజ్యోతి): వేదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం జనసేన నాయకులు నూనె మల్లికార్జున ఆలయంలో అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా వంశపారపర్యంగా తమ కుటుంబసభ్యులు బ్రహ్మోత్సవాల్లో రెండు రోజులు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. మంగళవారం కూడా అన్నదానం కొనసాగుతుందని తెలిపారు.

అన్నప్రసాదం వితరణ

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. ప్రభుత్వాసుపత్రిలోని శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, ఉపాధ్యక్షుడు కే.గోపాల్‌రెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, నేతలు గఫార్, శ్రీనివాసులరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు బలమైన ఈదురుగాలులతో చిరుజల్లులు కురిశాయి. ఈదురుగాలుల ధాటికి కొమ్మి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

వీరజవాన్ మురళీ నాయక్‌కు నివాళి

నెల్లూరు (జడ్పీ), మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జడ్పీ కార్యాలయంలో సోమవారం వీరజవాన్ మురళీ నాయక్‌కు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నివాళులర్పించారు ఆమె మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ జమ్మూ కశ్మీర్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న తెలుగు జవాన్ మురళీ నాయక్ అమరుడయ్యాడన్నారు. వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని భారతజాతి ఎన్నడూ మరిచిపోదన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ తదితరులు

ఇఫ్కో సేకరించిన భూములకు పరిహారం ఇవ్వాలి

నెల్లూరు (హరనాథపురం) మే 12 (ఆంధ్రజ్యోతి): ఇఫ్కో ఎరువుల కర్మాగారానికి భూములు ఇచ్చామని, పరిహారం ఇప్పించాలని దగదర్తి మండలం చవటపుత్తెడు, ఊచగుంటపాలెం గ్రామరైతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆ గ్రామాల రైతులు ఎస్‌కె.ఖాజాహుస్సేన్, ఎస్‌కె.బషీరుద్దీన్, పాపయ్య, మల్లి, ఎం.సురేష్ మాట్లాడుతూ చవటపుత్తెడులో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల నుంచి 43 ఎకరాల భూమిని, ఊచగుంటపాలెంలో 112 మంది రైతుల నుంచి 196 ఎకరాల భూమిని సేకరించాలని పేర్కొన్నారు. అవి సీజేఎఫ్‌ఎస్, డీఫారం పట్టా భూములని తెలిపారు. ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని, పరిహారం ఇస్తామని పేర్కొన్నారని చెప్పారు. ఉద్యోగాలు, పరిహారం ఇవ్వకపోవడంతో జీవనోపాధిని కోల్పోయామని వారు తెలిపారు. నష్టపరిహారం ఇవ్వకుంటే, తమ భూములు తమకు తిరిగి ఇప్పించాలని వారు కోరారు.


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రైతులు

ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి

నెల్లూరు (హరనాథపురం) మే 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్‌శాఖ దివ్యాంగుల సేవా సమితి నాయకులు సోమవారం తిరుపతిలో ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే డైరెక్టర్‌లు గురవయ్య, అయూబ్‌ఖాన్‌ను కలిశారు. అనంతరం మాట్లాడుతూ ఏపీ ఎస్పీడీసీఎల్‌లోని కార్యాలయాల్లో ఉద్యోగులకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఖాజీపూర్ హంజా నవాజ్‌ఖాన్, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ జనరల్ సెక్రటరీ భోగ సుధాకర్, తిరుపతి విభాగం అధ్యక్షులు శివశంకర్, తదితరులు ఉన్నారు.


సీఎండీ సంతోష్‌రావును కలిసిన దివ్యాంగ సేవా సమితి నాయకులు

హాకీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


సీనియర్ క్రీడాకారులు అందచేసిన టీషర్టులతో హాకీ క్రీడాకారులు

నెల్లూరు(విద్య), మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతున్న హాకీ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సోమవారం సీనియర్ క్రీడాకారులు టీషర్టులను అందచేశారు. ఈ సందర్భంగా కోచ్ చందు మాట్లాడుతూ యువ క్రీడాకారులంతా సీనియర్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడలో ఉత్తమంగా రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో హాకీ సీనియర్ క్రీడాకారులు కే.భానుప్రకాష్, అఖిల్, అది, హరీష్, లోకేష్, ఆకాష్, హితేష్, హమీద్, హఫీజ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సేవల్లో నర్సుల పాత్ర కీలకం

నెల్లూరు (వైద్యం) మే 12 (ఆంధ్రజ్యోతి) : రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించటంలో స్టాఫ్ నర్సుల పాత్ర చాలా కీలకమైందని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్ అన్నారు. జీజీహెచ్‌లో సోమవారం ప్రపంచ నర్సుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రమాద స్థితిలో ఉన్న రోగులకు సైతం అత్యవసర వైద్య సేవలు అందించటంలో నర్సుల పాత్ర ఎంతో ఉందన్నారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులగౌడ్, సభ్యులు అబిదాబేగం, మల్లిఖార్జున, సతీష్, నర్సింగ్ అసోసియేషన్ నేతలు సత్యవతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నర్సింగ్ దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నేతలు



స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతిదేవి అమ్మవారు - ప్రత్యేక అలంకారంలో శ్రీవారి దేవేరి(ఇన్‌సెట్లో)

స్వర్ణరథంపై సిరులతల్లి అభయం

● నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం

తిరుచానూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మహాలక్ష్మి అలంకారంలో పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారి ఉత్సవర్లను స్వర్ణరథంపై కొలువుదీర్చారు. 9.45 గంటలకు భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్వర్ణ రథోత్సవం మాడవీధుల్లో ప్రారంభమైంది. రథం లాగడానికి మహిళలు పోటీపడ్డారు. మధ్యాహ్నం ఫ్రైడే గార్డెన్‌లో అమ్మవారికి స్నపన తిరుమంజనం.. రాత్రి వీధోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, ఏఈవో దేవరాజులు, అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సర్పంచులకు గౌరవ వేతనం వచ్చిందోచ్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలకుగాను 2025-26మొదటి త్రైమాసం కింద రూ.1.46కోట్లువచ్చినట్లు గ్రామపంచాయతీ అధికారి సుశీలాదేవి సోమవారం తెలిపారు.అందులో 745 మంది సర్పంచులకు గౌరవ వేతనంకింద రూ.96.56లక్షలు, తలసరి ఆదాయానికి రూ.14.55 లక్షలు, వృత్తి పన్నుకు రూ.35.02లక్షలు చొప్పున విడుదలైనట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ ఖాతాలకు ఈ నగదు జమవుతుందన్నారు.

అర్ధరాత్రి అభిషేకం

తిరుపతి గంగజాతరకు చాటింపు అనంతరం వివిధ వేషాలలో మునిగితేలిన గంగమ్మకు సోమవారం అర్ధరాత్రి తర్వాత విశిష్ట అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సర్వాలంకారశోభితమైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు. అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి గంగజాతర ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోనే పరిమితం కాకుండా స్థానికంగా ఉన్న టీపీ ఏరియాలో తాళ్లపాక పెదగంగమ్మ, చింతలచేనులో ముత్యాలమ్మ, కుమ్మరితోపులో నేరేళ్లమ్మ, దాసరిమఠంలో మాతమ్మ, పల్లెవీధిలో వేశాలమ్మ, చింతకాయవీధిలో కరిమాను గంగమ్మతో పాటు చిన్న గంగమ్మ ఆలయంలోనూ జాతర సంబరాలు కనిపించాయి. దీంతో నగరమంతా జాతర సందడి కనిపిస్తోంది.

గంగమ్మ ఆలయానికి తరలివచ్చిన భక్తులు



నేడు తిరుపతి జాతర

పోటెత్తుతున్న భక్తులు ● వజ్రకిరీటంలో వెలిగిన గంగమ్మ

తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఊరంతా జాతర సందడి నెలకొంది. అమ్మలుగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లుతోంది. సోమవారం ఉదయం నుంచి ఓమోస్తరుగా రద్దీ ఉన్నప్పటికీ రాత్రి నుంచే గంగమ్మ ఆలయానికి భక్తులు బారులు తీరారు. చిత్ర, విచిత్ర వేషాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పల్లివీధిలోని వేశాలమ్మకు మంత్రి కొల్లు రవీంద్ర సారె అందజేశారు. కమిషనర్ మౌర్య నేతృత్వంలో తిరుపతి నగరపాలక సంస్థ, తుడా అధికారులు, సిబ్బంది అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీవారి ఆలయానికి పరదాలు అందించే మణి గంగమ్మ ఆలయానికి కూడా పరదాలతో పాటు తాత్కాలిక హుండీ క్లాత్‌ను ఈవో జయకుమార్‌కు అందజేశారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



పూజలందుకున్న సున్నపు కుండలు

సోమవారం సాయంత్రం వేశాలమ్మ ఆలయంలో కైకాల వంశస్థులు ఇద్దరు సున్నపు కుండలను ధరించారు. అక్కడ నుంచి నగరంలోని ప్రధాన వీధులలోని ఇళ్లకు వెళ్లి హారతులందుకున్నారు. సున్నపుకుండల వేషధారులను భక్తులు కుర్చీలో కూర్చోబెట్టి పాదపూజ చేసిమొక్కులు తీర్చుకున్నారు. బుధవారం వేకువజాము వరకు వీళ్లు ఊరంతా తిరిగి పూజలందుకోనుండటం విశేషం.

నేడు పేరంటాల వేషం

పేరంటాల వేషాన్నీ కైకాలవాళ్లే ధరిస్తారు. ఎర్రగళ్ల చీర, ఎర్రని గుడ్డలో ఒడిబాలను కట్టుకుంటారు. అందులో అక్షింతలు, చవ్వాకు, దువ్వెన, అద్దం, నల్లగాజులు, పసుపు, కుంకుమ ఉంచుతారు. తలకు నల్లని గుడ్డను కట్టి కొప్పులా ముడివేసుకుంటారు. తలపై బంగారంలా కనిపించే అట్టతో చేసిన జడ బిళ్లలు, పట్టీలు వంటి ఆభరణాలు కట్టుకుంటారు. పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుండి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. అక్కడ్నుంచి బుధవారం వేకువజామును చిన గంగమ్మ చెంప నరికిన తర్వాత పెద గంగమ్మ చెంపను నరకడంతో జాతర సంబరం ముగుస్తుంది.

నిరంతర పర్యవేక్షణ : కమిషనరు మౌర్య

గంగజాతర సందర్భంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మున్సిపల్ సిబ్బందితో పాటు సచివాలయ ఉద్యోగులూ విధుల్లో ఉంటారు. కూరగాయల మార్కెట్లో పొంగళ్లు పెట్టుకోవచ్చు. మంగళవారం వేకువన 3 గంటల నుంచే భక్తులకు దర్శనం ఏర్పాటుచేశాం. వీఐపీ పాసులు వుండవు. లక్ష మందికిపైగా భక్తులు దర్శనం కోసం వస్తారని అంచనా.

పోలీసులే బాధితులు!

మరి నిందితులెవరు?

● జిల్లా పోలీసు సహకార సొసైటీలో రూ.80 లక్షల దుర్వినియోగం

● విచారణకు ఆదేశించిన ఎస్పీ

నష్టపోయిన వారికి న్యాయం చేసే.. చేయాల్సిన పోలీసులే బాధితులుగా మారారు. పోలీసు సహకార సొసైటీ నుంచి తీసుకున్న రుణాలను త్వరగా తీర్చేయాలని జీతాలతో సంబంధం లేకుండా కంతులు కడుతూ వచ్చారు. అలా కట్టిన డబ్బులు సొసైటీకి జమకాలేదు. దాదాపు రూ.80 లక్షల వరకు దుర్వినియోగమైనట్లు తేలింది. పోలీసులను బాధితులు మార్చిన ఈ ఘటనలో నిందితులు ఎవరో తేలాల్సి ఉంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



చిత్తూరు కేంద్రంగా ఉమ్మడి జిల్లా పోలీసు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉండేది. ఆ తర్వాత తిరుపతి పోలీసు జిల్లా ఏర్పడటంతో 2014లో తిరుపతిలో జిల్లా పోలీసు సహకార సొసైటీని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సొసైటీ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సభ్యులుగా కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్‌ఐల వరకు దాదాపు 2830 మంది ఉన్నారు. సభ్యుల జీతం బేసిక్‌లో నుంచి రూ.1000 నుంచి రూ.5000 వరకు ఈ సొసైటీలో పొదుపు చేస్తారు. ఇలా నెలకు దాదాపు రూ.86 లక్షల వరకు పొదుపు అవుతున్నట్లు సమాచారం. ఇలా పొదుపు చేసిన మొత్తం నుంచి అవసరమైన పోలీసులకు రుణాలు మంజూరు చేస్తారు. ఈ రుణం కనిష్ఠంగా రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షల వరకు ఏడాదికి 12 శాతం లెక్కన వడ్డీ కింద మంజూరు చేస్తారు. తీసుకున్న రుణాన్ని 50 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాలి. దీంతో పాటు సొసైటీలో పోలీసులు పొదుపు చేస్తున్న డబ్బులకు సంబంధించి 11 శాతం కింద వడ్డీ చెల్లిస్తున్నారు. మిగిలిన ఒక శాతం సొసైటీ నిర్వహణకు ఉంచుతారు. ఇలా దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి ఒడిదుడుకులు, అవకతవకలు లేకుండా నిర్వహిస్తూ వచ్చారు. ఒక వేళ సకాలంలో తిరిగి రుణాలు చెల్లించని వారికి మళ్లీ కొంత గడువిచ్చి చెల్లించాలని విజ్ఞప్తి చేస్తారు.

అక్రమాలు జరిగిందిలా..

సభ్యులు తీసుకున్న రుణాలను గతంలో జీతాల బిల్లుల నుంచి నేరుగా రికవరీ చేసేవారు. ఇటీవల రెండేళ్లుగా పోలీసులు వారి అవసరాలకు తీసుకున్న రుణాల్లో 12 శాతం వడ్డీ కింద అసలు, వడ్డీ లెక్క కట్టి ప్రతి నెలా జీతాలతో సంబంధం లేకుండా చెల్లిస్తూ వస్తున్నారు. ఇలా చెల్లించిన డబ్బులను కొంత మంది అధికారుల చనువు, సొసైటీ నాయకత్వంలోని కొందరి సహకారంతో అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ హోదాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు సొసైటీ ఖాతాలో జమ చేయలేదని తెలిసింది. ఐదేళ్లుగా లావాదేవాలపై ఆడిట్ జరగకపోవడం వీరికి కలిసొచ్చింది. ఇలా దాదాపు రూ.80 లక్షలను దుర్వినియోగం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది. ఈ సొసైటీలో ఎలాంటి ఆడిట్ కూడా జరగనట్లు సమాచారం.

విచారణకు ఆదేశించిన ఎస్పీ

పోలీసు సహకార సొసైటీలో రూ.80 లక్షల దుర్వినియోగంపై ఎస్పీ హర్షవర్ధనరాజు విచారణకు ఆదేశించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, నాయుడుపేట డీఎస్పీ శేషుబాబును విచారణాధికారులుగా నియమిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సొసైటీలో నిధుల దుర్వినియోగానికి కారకుడన్న ఆరోపణలున్న జూనియర్ అసిస్టెంట్ హోదాలోని వ్యక్తిని తొలగించారు. కానిస్టేబుల్ రవికి ఆ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలిచ్చారు. 'ఈ ఘటన వెనుక ఎవరెవరు ఉన్నారనేది విచారణలో తేలుతుంది. దీనిపై నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

అమ్మో.. అంత జీతమా?

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ కింద ఎవరినైనా ఉద్యోగంలోకి తీసుకుంటే ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఇస్తుంది. ఇక్కడి సొసైటీలో మాత్రం జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి రూ.95 వేల జీతం చెల్లిస్తున్నారు. ఈ విషయం తెలిసి ఎస్పీ హర్షవర్ధనరాజు ఆశ్చర్యపోయారు. జిల్లా స్థాయి అధికారులకు కూడా అంత జీతాల్లేవు కదా అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. దీనిపై ఏవోను పిలిపించి అడగ్గా.. అంత జీతం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

తిరుపతి జాయింట్ రిజిస్ట్రార్‌పై వేటు



చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఈ ఏడాది మొదట్లో రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వాదాయానికి గండి కొట్టిన తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 నీరజను శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ గిరిబాబు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి శివజ్యోతి నగర్‌లోని ప్రధాన రోడ్డుకు అనుబంధంగా ఉన్న కొన్ని గజాల స్థలాన్ని కాకుండా అదే భవనంలోని మిగిలిన కొంత స్థలాన్ని రెసిడెన్షియల్ పరిధి కింద సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనలమేర ఆ స్థలం మొత్తాన్ని కమర్షియల్‌గా చూపించాల్సి ఉండగా, రెసిడెన్షియల్ పరిధిలో చూపి తక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేశారు. దీనివల్ల రూ.82 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఈ రిజిస్ట్రేషన్‌పై అందిన ఫిర్యాదు మేర మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ డీఆర్ (ఏపీ ఏడీఆర్) మునిశంకరయ్య క్షేత్రస్థాయి పరిశీలన చేసి సబ్‌రిజిస్ట్రార్-1 నీరజ చేసిన అక్రమం నిజమేనని నిర్ధారించారు. ఈ మేరకు నివేదిక అందించడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసినట్లు డీఐజీ గిరిబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించేవరకు తిరుపతి ఆర్వోలో పనిచేస్తున్న జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మీదేవి జాయింట్-1గా కొనసాగుతూ రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బందిలేకుండా విధులు నిర్వహిస్తారని డీఐజీ పేర్కొన్నారు. కాగా, పీలేరు నుంచి ఇటీవల బదిలీపై తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్న నీరజ ఆడిట్ తనిఖీలో దొరికిపోయారు. కొన్ని రోజులుగా సెలవులో ఉన్న ఆమెపై ఆరు నెలల పాటు సస్పెండు వేటు పడింది.



సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు

వైభవంగా వైశాఖ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో సోమవారం వైశాఖ పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. మలయప్పస్వామిని విశేషంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు ప్రియ వాహనుడు గరుడునిపై స్వామి కొలువుదీరి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని మలయప్పస్వామిని దర్శించుకున్నారు. గ్యాలరీల్లోని భక్తుల గోవిందనామస్మరణలు, కర్పూర హారతుల వెలుగులతో మాడవీధులు శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,423

తలనీలాలు సమర్పించినవారు: 29,361







దీవించమ్మా.. గంగమ్మ

ఇద్దరు కైకాల కులస్థులు సున్నపు కుండల వేషధారణతో గంగమ్మను దర్శించుకున్నారు. మిగిలిన భక్తులు చిత్ర, విచిత్ర వేషాలను ధరించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వేప చీరలు ధరించి కొందరు.. పొర్లు దండాలతో మరికొందరు గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఆస్తులు పంచేశాను

పిల్లలు చూడడం లేదు ● సబ్‌కలెక్టర్‌కి విన్నవించుకున్న విశ్రాంత పోలీసు

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): 'నా భార్య చనిపోయింది. ఉన్న ఆస్తిని కుమారుడు, కుమార్తెకు పంచి పెట్టాను. వృద్ధాప్యంలో వాళ్లు నన్ను చూడటం లేదు' అని కోట మండలం విద్యానగర్‌కు చెందిన విశ్రాంత హెడ్‌ కానిస్టేబుల్ మస్తానయ్య ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందించారు. తనకు జీవనం ఇబ్బందికరంగా మారిందని, సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారుడు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరు



ఎస్వీ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం మొదలైన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 7,427 మందికిగాను 448 మంది.. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 848 మందికి గాను 78 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

డిపో నిర్వహణ ఇలాగేనా..!

సిబ్బంది కొరతైతే ఓడీల్లో ఎందుకున్నారు? ● ఆర్టీసీ అధికారుల తీరుపై జోనల్ చైర్మన్ అసహనం

సూళ్లూరుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): 'డిపో నిర్వహణ ఇలాగేనా? కార్యాలయ సిబ్బంది 11 గంటలైనా ఎందుకు రాలేదు? పరిసరాలు ఇలాగేనా ఉండేది? అధికారులు ఏం చేస్తున్నారు?' అంటూ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట డిపోను సోమవారం తనిఖీ చేసిన ఆయన.. 11 గంటలైనా సిబ్బంది రాకపోవడాన్ని గుర్తించారు. ఉదయం 5 గంటలకు విధుకు హాజరుకావాల్సిన సూపర్‌వైజర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు సర్వీసుల వివరాలను అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డిపో నిర్వహణతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గత వైసీపీ సర్కారు ఆర్టీసీ ఆస్తులను సైతం తాకట్టు పెట్టి సంస్థను నిర్వీర్యం చేసిందని, దానిని సరిదిద్ది పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ఎలాగని ప్రశ్నించారు. డిపోలో తగినంత మంది సిబ్బంది లేనప్పుడు కండక్టర్లు, డ్రైవర్లను ఓడీల్లో ఎందుకు ఉంచుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన విజిలెన్స్ విచారణ నివేదిక తెప్పించుకొని డిపో నిర్వహణను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, విజయమ్మ పాల్గొన్నారు.



డిపోను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఈ-సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురండి

తిరుపతి(వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తిరుపతి రుయాస్పత్రిలో ఈ సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. రుయాస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, పెథాలజీ, ఎంఆర్ఐ, రేడియాలజీ విభాగాలను పరిశీలించారు. తక్షణమే వైద్య పరీక్ష ఫలితాలను అందించేందుకు ఈ-సిటీ డయాగ్నోసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. 24 గంటలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ సెంట్రల్ ల్యాబ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. మందులు, వైద్య పరికరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డీఎస్ఎన్ మూర్తి, వైద్యులు మాధవీలత, శ్రీధర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న హెల్త్ కమిషనర్ వీరపాండ్యన్

పిడుగుపాటుకు యువకుడి బలి

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): తడ సున్నపుగుంట ప్రాంతానికి చెందిన ఇరుదైనాధన్ డేవిడ్ అలియాస్ చెందు(22) పిడుగుపాటుకు బలయ్యాడు. సోమవారం మధ్యాహ్నం పల్లిపాళెం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో స్నేహితులు భాను, విజయ్, వంశీ, గుణ, మరియదాసులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా పిడుగుపడింది. ఇరుదైనాధన్ డేవిడ్ స్పృహ తప్పిపడిపోవడంతో వెంటనే శ్రీసిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.



మృతిచెందిన ఇరుదైనాధన్ డేవిడ్

మేము సైతం

● ఇండియన్ ఆర్మీకి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15లక్షలు



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భారత సైన్యానికి తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15 లక్షల చెక్కును విరాళంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం హోండా మోటార్స్ పృథ్వీ ఇతర ఆటోమొబైల్ డీలర్లతో కలిసి కలెక్టర్‌కు చెక్కు అందజేశారు.

అర్ధరాత్రి ప్రమాదం

● ఆటోను ఢీకొన్న టిప్పర్

● 8 మంది తమిళనాడువాసులకు తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలం పదో మైలు వద్ద సోమవారం అర్ధరాత్రి ఆటోను టిప్పర్ ఢీకొనడంతో 8 మందికి తీవ్ర.. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం పెరంబూరుకు చెందిన 11 మంది శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి సోమవారం బస్సులో వరదయ్యపాళేనికి వచ్చారు. అక్కడ్నుంచి ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. పదో మైలు వద్ద వీరి ఆటోను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని తిరుపతి రుయాకు పంపించారు.



గాయపడిన రవిచంద్రన్ - కుమారవేల్

బి న్యూ మొబైల్ స్టోర్స్‌లో సమ్మర్ ఆఫర్లు

హైదరాబాద్, మే 12 : బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఈసారి సమ్మర్ స్పెషల్ ఆఫర్లతో మరింత ఆకర్షణీయంగా ముందుకొచ్చిందని బీ న్యూ మొబైల్స్ సీఈవో వై. సాయి నిఖిలేష్ తెలిపారు.10 సంవత్సరాలుగా వినియోగదారుల మద్దతును పొందిన తమ సంస్థ, తాజాగా తిరుపతి మరియు శ్రీకాకుళం పట్టణాల్లో స్టోర్లను ప్రారంభించిందని మీడియా సమావేశంలో ఆయన వివరించారు.కేవలం మొబైల్ ఫోన్లకే కాకుండా, గృహోపకరణాలపై కూడా సమ్మర్ ఆఫర్లను ఇస్తున్నామని తెలిపారు.ఎంఐ, వీవో, ఒప్పో, రియల్‌మి, ఐఫోన్, శాంసంగ్, నథింగ్, వన్ ప్లస్ మొబైల్స్‌పై ఖచ్చితమైన బహుమతులతో పాటు ల్యాప్‌టాప్‌లపై రూ.10,000 వరకూ, టీవీలపై 37,000 వరకూ క్యాష్ బ్యాక్ ఇస్తున్నామన్నారు.ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50% వరకు డిస్కౌంట్, మొబైల్ యాక్సెసరీస్‌పై 85% వరకు డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై 35,000 వరకు క్యాష్ బ్యాక్ వుందన్నారు.జీరో డౌన్ పేమెంట్ + నో కాస్ట్ ఈఎంఐపై మొబైల్స్, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కూలర్లు, ఏసీలు,ఐఫోన్‌పై స్పెషల్ డిస్కౌంట్లు మరియు 35,000 వరకూ క్యాష్ బ్యాక్ వుందన్నారు. ప్రీమియం మొబైల్ కొనుగోలు చేస్తే, ఏసీ, కూలర్, సౌండ్‌బార్స్ స్మార్ట్ టీవీ ఉచితమన్నారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. సాయి నితీష్ మాట్లాడుతూ, ఏసీలు మరియు ఎయిర్ కూలర్లు ఇప్పుడు బీ న్యూ స్టోర్లలో ప్రత్యేక సమ్మర్ ధరలతో అందుబాటులో ఉన్నాయన్నారు. పాన్ కార్డ్ మరియు ఆధార్ కార్డ్ సిబిల్ స్కోర్ అవసరం లేకుండా బజాజ్ ఫైనాన్స్ ద్వారా సులభంగా ఈ సమ్మర్ డీల్స్ పొందొచ్చని తెలియజేశారు.సీఎండీ వై.డి. బాలాజీ చౌదరి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని 150 షోరూంలలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.



టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

తిరుపతి(విద్య) మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సోమవారం ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీజే రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవోను రద్దుచేసి కొత్త జీవో విడుదల చేసిన తర్వాత మాత్రమే పాఠశాలలను పునఃసమీక్షించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ఐదు తరగతులు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల్లో నియమించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్లతో కలిపి లెక్కించి ఆ మేరకు పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఇలా మొత్తం 13 డిమాండ్లను వివరిస్తూ తక్షణం వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులు కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారి మోహన్‌బాబు, నాయకులు సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులు బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, మస్తానయ్య, పద్మజ, హేమాంబరధరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు

చిల్లకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై ఉంచి పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో ఊరేగించారు. కందల సుధాకర్, నీరజమ్మ, రావుల వెంకటేశ్వర్లుగౌడ్, ధనమ్మ, అనిశెట్టి సుబ్రహ్మణ్యంశెట్టి, అన్నాడి కృష్ణయ్యశెట్టి, సుబోష్‌శెట్టి, అనిశెట్టి గురునాధం, అన్నాడి లోకనాథం, వరిదిరెడ్డి రామ్‌మోహన్‌రెడ్డి, గిరిజ, యల్లంటి ప్రభాకర్‌రెడ్డి, సులోచనమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి

నాయుడుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపు సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం నాయుడుపేట బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న కుళాయిల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నట్లు గుర్తించారు. శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్‌లో పరిస్థితులను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి నూతనంగా బస్టాండ్ నిర్మించేందుకు కృషి చేస్తానని చెప్పారు. బస్టాండ్ ప్రాంగణంలో శుభ్రత పాటించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, సురేంద్ర, రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, ధనంజయ, వెంకటేశ్వర్లు, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎనలేనివి



ఫ్లోరెన్స్‌నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు నర్సులు అందించే సేవలు ఎనలేనివని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి వద్ద మైథిలి నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆస్పత్రి నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నర్సులు చేసే సేవలు ఎంతో గొప్పవన్నారు. డాక్టర్లు కొంత సమయం మాత్రమే రోగుల వద్ద ఉండి సూచనలు అందిస్తారని, నర్సులు నిరంతరం సేవలు అందించడం వారిలోని సేవాగుణానికి తార్కాణమన్నారు. డాక్టర్ హితైషి, మైథిలి రమణబాబు, మస్తాన్, గౌరీ, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



రైతులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

వెంకటగిరి, మే 12:(ఆంధ్రజ్యోతి) నెల్లూరు జిల్లా కోవూరు పశుగణాభివృద్ధి సంస్థ, వెంకటగిరి ప్రాంతీయ పశువైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బొప్పాపురంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడల ఉత్పత్తితో రైతులు మేలు జాతి దూడల పెంపకాన్ని చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. సహాయ సంచాలకుడు స్వామిబాబు దూడల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ప్రదర్శనలో పాల్గొన్న దూడల్లో ఉత్తమ జాతి దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు కిషోర్ కుమార్, శ్రీనివాస సేవాసంస్థ ప్రతినిధులు, పాడి రైతులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో పౌర్ణమి వేడుకలు



పుష్పాలంకరణలో స్వామివారు

సూళ్లూరుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో చైత్రపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో అలంకరించి పూజల అనంతరం జ్యోతుల హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

చెరువులో ఆక్రమణలను తొలగించండి

వాకాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): వాకాడు చెరువులో ఆక్రమణలను తొలగించాలని రైతులు సోమవారం తహసీల్దారు రామయ్యకు వినతిపత్రం అందజేశారు. కొందరు చెరువును ఆక్రమించి పంట పొలాలుగా మార్చేశారన్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయి నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు.

బాలసదన్‌లో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కోట, మే 12 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూపరింటెండెంట్ దుర్గాదేవి కోరారు. పార్ట్‌టైం ప్రాతిపదికన పనిచేసేందుకు వంట మనిషి, నైట్ వాచ్ ఉమెన్, ఎడ్యుకేటర్, పీఈటీ, యోగా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9553899070 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి: పట్టణంలోని రాణీపేటలో ఉన్న బాలసదనంలో ఖాళీగా ఉన్న పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు సూపరింటెండెంట్ కమలమ్మ తెలిపారు. కుక్, నైట్ వాచ్‌ఉమెన్, ఎడుకేటర్, ఆర్ట్‌క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్, పీటీ, యోగా టీచర్ పోస్టులు కాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9951617968 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

15న వాకాడు మండల మీట్

వాకాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): వాకాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్త్రీశక్తి భవనంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.





హాకీలో మెలకువలు నేర్పుతున్న కోచ్ దీపక్‌ఆకాష్ - క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ లవకుమార్

వేసవి శిక్షణ శిబిరాలతో క్రీడా వికాసం

గూడూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి ఉచిత శిక్షణ శిబిరాల నిర్వహణతో క్రీడా వికాసం మెరుగుపడుతోంది. వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తుండడంతో క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. గూడూరు పట్టణంలోని ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రాష్ట్ర స్పోర్ట్స్ ఆథారిటీ(శాప్) ఆధ్వర్యంలో హాకీ, గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్‌లో ఉచితంగా శిక్షణ అందజేస్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఈ శిబిరాలకు పంపేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

హాకీకి ప్రత్యేక స్థానం

గూడూరు నుంచి పలువురు సీనియర్ క్రీడాకారులు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో రాణించడంతో పాటు స్పోర్ట్స్ కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. దీంతో హాకీ పట్ల స్థానిక క్రీడాకారుల్లో ఆసక్తి పెరిగింది. శాప్ కోచ్ దీపక్ ఆకాష్ క్రీడాకారులకు హాకీలో మెలుకులను నేర్పుతూ తర్ఫీదు ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు జశ్వంత్, సుమంత్, భార్గవ్, లక్ష్మీవరప్రసాద్, ఇస్మాయిల్, శాంతకుమార్, హనుమంతు, మసూద్ జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటారు. అదేవిధంగా హాకీలో రాణించిన మణికంఠ, ఏరోన్ ఆడిట్ జనరల్ విభాగంలో, అయ్యప్ప, శ్రావణ్, సందీప్, సనత్‌కుమార్ ఆర్మీలో, సుధాకర్, అనీల్, చిరంజీవి పోలీస్‌శాఖలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే కోచ్‌లుగా లక్ష్మీనారాయణ, దీపక్‌ఆకాష్, చెందు, అశోక్ శాప్‌లో పనిచేస్తున్నారు.

క్రికెట్ శిక్షణకు ఆధునిక సౌకర్యాలు

గ్రామీణ క్రీడాకారులను క్రికెట్‌లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో గూడూరు క్రికెట్ క్లబ్‌ను ఏర్పాటు చేసి నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ సబ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రత్యేకంగా నెట్‌తో పాటు యాస్ట్రో టర్ఫ్ పిచ్ ఏర్పాటు చేసి కోచ్ లవ కుమార్ క్రీడాకారులకు మెలుకువలను నేర్పుతూ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారుల్లో లీలా వికాష్ అండర్ -14 విభాగంలో రాష్ట్ర ప్రాబబుల్స్‌కు ఆడారు. అండర్ -12 విభాగంలో మౌనిష్, అండర్ -14 విభాగంలో జాన్ బెన్నీ, అండర్-16లో పూర్ణయశ్వంత్‌రెడ్డి, చైతన్య జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. గతంలో హాకీ, క్రికెట్‌లో శిక్షణ పొందాలంటే ఇతర నగరాలకు వెళ్లాల్సివుండేది. గత 12 ఏళ్లుగా గూడూరులోని ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో హాకీ, క్రికెట్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంతో పాటు సమీప గ్రామాల యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తున్నారు.

జోరందుకున్న వరినాట్లు



పెళ్లకూరు మండల కొత్తూరులో వరినాట్లు వేస్తున్న మహిళలు

పెళ్లకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు, పసుపుకండ్రిగ, చింతపూడి, యడపూడి, జీలపాటూరు, చావాలి, రావులపాడు, పుల్లూరు, కలవకూరు, పెన్నేపల్లి తదితర గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. ఏటా మే, జూన్ మాసాల్లో వరిసాగు ప్రారంభమవుతుంది. ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండి పెద్దగా వర్షాలు కురవకపోవడంతో సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఎడగారు సాగుపై ఆశలు చిగురించాయి. ఇప్పటికే నార్లు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల్లో ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట: మండలంలోని స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లో ఎడగారు వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఏటా ఏప్రిల్, మే మాసాల్లో ఎడగారు వరిసాగు రైతులు చేపడుతారు. గత ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. ప్రధానంగా గూడలి, దక్షణపొలం, రాజుపాళెం, తిన్నెలపూడి, తాటితోపు, వెంకన్నపాళెం, చిటేడు, రుద్రవరం గ్రామాల్లోని స్వర్ణముఖినది సమీపంలో ఉన్న ఫిల్టర్ పాయింట్‌లు, నేలబావుల కింద రైతులు ఏడగారు వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా 1010 రకం, నెల్లూరు జిలకర్లు, సన్నాల సాగు చేస్తున్నారు.

అవినీతిని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు అవినీతికి పాల్పడినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు అనంతరం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో పనిచేసే ఇద్దరు వీఆర్వోలు అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సకాలంలో అందించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను కార్యాలయాలకు తిప్పుకోవడం, నగదు వసూళ్లకు పాల్పడితే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి విధుల్లో జాప్యం కలుగకుండా సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. గాంధీనగర్ ప్రాంతంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తహసీల్దారుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పెంచలయ్య, దాము, చంద్రమౌళి, అమరయ్య, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో తేలికపాటి జల్లులు

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం కొంతసేపు తేలిపాటి జల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండతీవ్రత ఉన్నా, సాయంత్రం ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులతో తేలికపాటి వర్షం కురిసింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

పిడుగుపడి రెండు గేదెల మృతి

గూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి రెండు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి తన గేదెలను విందూరు సమీపంలోని చెరువులోకి మేతకు తీసుకువెళ్లాడు. సాయంత్రం పిడుగుపడడంతో రెండు గేదెలు మృతిచెందాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటినట్లు బాధితుడు తెలిపారు.

వైభవంగా శ్రీరంగపెరుమాల్ కల్యాణం



కల్యాణోత్సవానికి కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడు దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగ పెరుమాల్ ఆలయంలో చైత్రపౌర్ణమి సందర్భంగా సోమవారం మహాలక్షార్చన ప్రారంభించారు. స్వామివారికి వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదిక పై శ్రీరంగపెరుమాల్, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఎం.శ్రీరాం మొదలి, సుదర్శన్ మొదలి, కె.శ్రీధర్, కె.హరి, సునీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పోలేరమ్మకు తాళిబొట్టు అందజేత

నాయుడుపేట టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు మండలంలోని ఒద్దిగుంటకండ్రిగ గ్రామానికి చెందిన విజయకుమార్, సుమలత దంపతులు తాళిబొట్టు అందజేశారు. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర కమిటీ అధ్యక్షుడు సుబ్బారావుకు తాళిబొట్టును అందజేశారు.



తాళిబొట్టు అందజేస్తున్న భక్తులు

విజయదుర్గాదేవికి ప్రత్యేక పూజలు



విజయదుర్గాదేవికి పూలతో అభిషేకం

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి శ్రీచక్ర వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి పంచామృత సహిత పరిమళ సుగంధ ద్రవ్యాలు, పూలతో ప్రత్యేకంగా అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. రాత్రి నవావరణ హోమ పూజలను శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం విజయదుర్గా స్తుతిరత్నం ఆడియో సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్, తానంకి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'



శ్రీలక్ష్మమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

కోట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, కొండమిట్ట, చిట్టేడు, కేశవరం, ప్రకాశంకాలనీ, చెందోడు, శ్రీలక్ష్మమ్మకాలనీ, శ్యామసుందరపురం, కోట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు తమ తల్లుల పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు.

విద్యార్థినికి నగదు బహుమతి

చిట్టమూరు, మే 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ పూచిన బురదగాలి గ్రామానికి చెందిన విద్యార్థిని అశ్రితకు ఉపాధ్యాయుడు వెంకటయ్య సోమవారం నగదు బహుమతిగా అందజేశారు. నాయుడుపేటలోని పుదూరు బాలికల గురుకుల పాఠశాలలో చదివిన అశ్రిత పదో తరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించింది. ఉపాధ్యాయుడు వెంకటయ్య బురదగాలి గ్రామంలోని అశ్రిత ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానించి ఐదు వేల రూపాయలు నగదు అందజేశారు.

కరిమాణిక్యస్వామికి హనుమంత వాహనసేవ

నాయుడుపేట టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం చప్పర ఉత్సవం, ఊంజల్‌సేవ, రాత్రి హనుమంత వాహనసేవ నిర్వహించారు.

వెంకటగిరిలో ఆరు సింగిల్ విండోలకు పర్సన్ ఇన్‌ఛార్జుల మార్పు

తిరుపతి, మే 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు సింగిల్‌విండోలకు కొత్తగా అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాధవాయపాలెం, కుందం, లాలాపేట, జయంపు, మోపూరు, డక్కిలి సింగిల్‌విండోలకు గతేడాది 19న వెంకటగిరి సీనియర్ సహకార ఇన్‌స్పెక్టర్ డి.మాధవిని అఫిషియల్ పర్సన్ ఇంఛార్జిగా నియమించగా, ఆమె అనారోగ్యంతో గత నెల 23న మృతి చెందారు. పర్సన్ ఇంఛార్జిగా ఆమె పోస్టు గడువు వచ్చే నెల 20వ తేదీ దాకా ఉంది. దీంతో ఆమె స్థానంలో ఈ విండోలకు కొత్త పర్సన్ ఇంఛార్జులు నియమితులయ్యారు. మాధవాయ పాలేనికి వెంకటగిరి జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.నజరిన్, కుందం, లాలాపేట విండోలకు గూడూరు జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.మహేశ్ సింగ్, జయంపు విండోకు గూడూరు సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్యామ్ కుమార్, మోపూరు, డక్కిలి విండోలకు గూడూరు జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.అర్కినాథన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు పదోన్నతి లభించింది. గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం పదోన్నతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 11 మందికి పదోన్నతులు లభించగా అందులో జిల్లా నుంచీ ఫజులుల్లా వున్నారు. పదోన్నతిపై ఆయన్ను నాయుడుపేటలోనే కొనసాగిస్తూ సోమవారం మున్సిపల్ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.


విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థినిని సన్మానించి నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 20మంది విద్యార్థులను సోమవారం సన్మానించి ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.5వేలు, 3వ బహుమతి రూ.4వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖలో మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే విజయశ్రీ నియోజకవర్గానికి సుమారు 50 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, శ్రీనివాసులు నాయుడు, రఫీ, పొట్లపూడి రాజేష్, సుబ్బారావు, నారాయణ, సంచి కృష్ణయ్య, సుధీర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ నేత వాకాటి పినతల్లి మృతి



చంద్ర వదనమ్మ అంత్యక్రియల్లో ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పినతల్లి చంద్రవదనమ్మ(81) ఆదివారం కన్నుమూశారు. తడ మండలం చేనిగుంటలోని నివాసం ఉంటున్న ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చంద్ర వదనమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు సోమవారం వాకాటి నారాయణరెడ్డి ఇంటికి చేరుకొని ఆయన పినతల్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు జి.సతీష్ రెడ్డి, సూళ్లూరుపేట, కావలి ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కావ్యాకృష్ణారెడ్డి తదితరులు చంద్ర వదనమ్మకు నివాళులర్పించారు.

నాగశక్తి పీఠం స్థాపనకు భూమిపూజ

కోట, మే 12 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు రాజరాజేశ్వరి ఆల య ప్రాంగణంలో నాగశక్తి పీఠ స్థాపనకు సోమవారం భూమిపూజ జరిగింది. దేవ ప్రయాగ నాగశక్తి పీఠం ఉత్తరాధికారి చిదానంద మహరాజ్ హోమాలు నిర్వ హించి భూమిపూజ చేశారు. వేద పండితుల యజ్ఞయాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్, రాజారత్నం, కోటయ్య, విజయశంకర్, సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు, సురేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు